STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 348 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 18 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |



ఖరీదైన మద్యం సీసాల్లో చీప్ లిక్కర్

- క్యాబ్ డ్రైవర్ ఇంట్లో కల్తీ మద్యం తయారీ కేంద్రం
- జానీ వాకర్, డీవర్స్, 100 పైపర్స్ సీసాల్లో చీప్ లిక్కర్ నింపి విక్రయం
- 10 ఫుల్ బాటిళ్లు, 30కిపైగా ఖాళీ సీసాలు స్వాధీనం 2
- ఇద్దరు నిందితుల అరెస్ట్..
- మరో పది మంది కొనుగోలుదారులపై నిఘా



రియల్ ఎస్టేట్ సంస్థలకు రెరా షాక్!

- నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణ సంస్థలపై కొరడా
- సనాలి ఐటీ పార్క్‌కు రూ.25 లక్షల భారీ జరిమానా
- వడ్డీతో సొమ్ము తిరిగి చెల్లించాలని ఆదేశాలు
- అరైన్ ఇన్‌ఫ్రా ఫ్లాట్ వెంటనే అప్పగించాలని స్పష్టీకరణ
- ఆదేశాలు బేఖాతరు చేస్తే మరిన్ని జరిమానాలు 2



సమ్మక్క సాగర్‌కు అనుమతులివ్వండి!

ఛత్తీస్‌గఢ్ సీఎంకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

- రాయ్‌పూర్‌లో విష్ణుదేవ్ సాయితో కీలక భేటీ
- నిరభ్యంతర పత్రం త్వరగా జారీ చేస్తామని హామీ
- ప్రాజెక్టుతో ఛత్తీస్‌గఢ్‌లో ముంపు కేవలం 33 ఎకరాలే
- 6.94 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో సమ్మక్క సాగర్
- గిరిజన, వెనుకబడిన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలే లక్ష్యం

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన బహుళ ప్రయోజనాల సమ్మక్క సాగర్ బ్యారేజీకి వెంటనే నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ప్రాధాన్యం, ముంపు ప్రభావం, నీటి నిల్వ అవసరాలను వివరించారు. ఈ విజ్ఞప్తిపై ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూలంగా స్పందించి ఎన్‌ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది.

రాయ్‌పూర్, నవంబర్ 17 (సమయం న్యూస్): ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన బహుళ ప్రయోజనాల 'సమ్మక్క సాగర్' బ్యారేజీని పూర్తి చేయ డానికి వెంటనే నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చే యాలని సీఎం రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయిని కోరారు. మంగళవారం రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ సీఎంను కలిసి ఈ అంశంపై సమగ్రంగా చర్చించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలను వారికి వివరించారు. ఈ భేటీలో ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూలంగా స్పందించారని, ఎన్‌ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మిగతా 2 లో



దాడికి ముందే రెక్కీ..

- సీఆర్‌పీఎఫ్ బలగాలపై దాడికి ముందే పక్కా ప్రణాళిక
- సీసీ కెమెరాల్లో ఉగ్రవాదుల కదలికలు!
- ఎదురుకాల్పుల్లో ఉమర్ నిసార్ దార్ హతం

4

గర్ల్‌ఫ్రెండ్‌తో రెస్టారెంట్‌కు..

- అమ్మానాన్న తొలిసారి కలుసుకున్న చోటుకే ప్రేయసితో..
- జ్ఞాపకాలను పంచుకున్న రాహుల్ గాంధీ






పోటీ కాదు.. సహకారమే మన భవిష్యత్తు!

- భారత్-ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు
- ప్రపంచ జనాభాలో నాలుగో వంతుకు ప్రాతినిధ్యం
- శాంతి, స్థిరత్వం, సమష్టి అభివృద్ధే లక్ష్యం

భారత్-ఆసియాన్ దేశాల కూటమి కలిసి ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, కాబట్టి మన ఉమ్మడి భవిష్యత్తును కేవలం పోటీ కాకుండా పరస్పర సహకారమే నిర్దేశించాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన ఇండియా-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో 11 సభ్య దేశాల నేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

4

రాజన్న ఆలయం వద్ద ఉద్రిక్తత



- ప్రధాన గోపుర శిఖరం తొలగింపుపై దుమారం
- ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా పనులు చేపట్టారంటూ బీజేపీ ఆందోళన
- ఆలయ అభివృద్ధి పనులు నిలిపివేయాలని డిమాండ్
- ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

2

వెంటిలేటర్‌పైకి విద్యావ్యవస్థ!



- ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయంపై కవిత తీవ్ర ఆగ్రహం
- విద్యార్థుల స్థానికత హక్కులకు ముప్పు ఉందని ఆరోపణ
- కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేసేందుకేనని విమర్శ

3



మూసీ సుందరీకరణ అవసరమా?

సీఎంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

బధిర మహిళపై గ్యాంగ్ రేప్

- అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో ఇద్దరి అరెస్ట్!
- తల్లిదండ్రులకు అనారోగ్యమంటూ నమ్మించి దారుణం

2



విద్యుత్ వినియోగంలో ఆల్‌టైమ్ రికార్డు

- తొలిసారిగా 20 వేల మెగావాట్లు దాటిన గరిష్ఠ డిమాండ్
- రెండు కొత్త సబ్‌స్టేషన్లు ప్రారంభం..
- రబీకి ముందస్తు ఏర్పాట్లు
- ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

2





ఖరీదైన మద్యం సీసాల్లో చీప్ లిక్కర్

క్యాబ్ డ్రైవర్ ఇంట్లో కల్తీ మద్యం తయారీ కేంద్రం

జానీ వాకర్, డీవర్స్, 100 పైపర్స్ సీసాల్లో చీప్ లిక్కర్ నింపి విక్రయం

10 ఫుల్ బాటిళ్లు, 30కిపైగా ఖాళీ సీసాలు స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్ట్.. మరో పది మంది కొనుగోలుదారులపై నిఘా

హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): క్యాబ్ డ్రైవర్ ముసుగులో కల్తీ మద్యం దందా సాగిస్తున్న ఇద్దరు వ్యక్తులను గ్రేటర్ హైదరాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) పోలీసులు అరెస్ట్ చేశారు. తక్కువ ధరకు లభించే మద్యాన్ని ఖరీదైన విదేశీ బ్రాండ్ల ఖాళీ సీసాల్లో నింపి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి కల్తీ చేసిన 10 ఫుల్ బాటిళ్లతోపాటు 30కిపైగా ఖాళీ ఖరీదైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వంగలి అశోక్ (43) గతంలో బగ్గా డిస్టిలరీలో పనిచేశాడు. ఆరు నెలల క్రితం ఆ ఉద్యోగం మానేసి క్యాబ్ డ్రైవర్‌గా మారాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో శంషాబాద్ శాతమ్రాయిలోని తన నివాసంలో కల్తీ మద్యం తయారీ, విక్రయాలు ప్రారంభించాడు. మహమ్మద్ యాకూబ్ పాషా (29) నిర్వహిస్తున్న స్క్రాప్ దుకాణం నుంచి ప్రముఖ బ్రాండ్ల ఖాళీ మద్యం సీసాలను అశోక్ కొనుగోలు చేసేవాడు. వాటిని శుభ్రం చేసి, మూతలను జాగ్రత్తగా తొలగించి, ఒక్కో సీసాలో రూ.560 విలువైన డౌన్‌టౌన్ వంటి చౌక మద్యాన్ని నింపేవాడు. జానీ వాకర్, డీవర్స్, 100 పైపర్స్ వంటి ఖరీదైన బ్రాండ్ల పేరుతో ఈ మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు. ఈ అక్రమ వ్యాపారంపై సమాచారం అందుకున్న కానిస్టేబుల్ ధనుంజయ్.. డీటీఎఫ్ సీఐ నరేందర్‌కు వివరాలు అందించారు. దీంతో నరేందర్ నేతృత్వంలోని బృందం శాతమ్రాయిలోని అశోక్ నివాసంపై ఆకస్మికంగా దాడి చేసింది. అక్కడ కల్తీ మద్యం బాటిళ్లు, ఖాళీ సీసాలను స్వాధీనం చేసుకుని అశోక్‌ను అదుపులోకి తీసుకుంది. అతడు వెల్లడించిన సమాచారం ఆధారంగా ఖాళీ సీసాలు సరఫరా చేస్తున్న స్క్రాప్ దుకాణం యజమాని యాకూబ్ పాషాను కూడా అరెస్ట్ చేశారు. నిందితులు ఈ మద్యాన్ని స్థానికంగా సుమారు పది మందికి విక్రయించినట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుని విచారించనున్నట్లు తెలిపారు. అరెస్టయిన ఇద్దరితోపాటు స్వాధీనం చేసుకున్న మద్యాన్ని తదుపరి చర్యల కోసం శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎస్సైలు హనుమంతు, నజీర్ పాషా, ఇన్‌ఛార్జి సీఐ భరత్‌కుమార్, సిబ్బంది ధనుంజయ్, అభినయ్, కిషన్, భాస్కర్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ సంస్థలకు రెరా షాక్!

నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణ సంస్థలపై కొరడా

సనాలి ఐటీ పార్క్‌కు రూ.25 లక్షల భారీ జరిమానా



హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): రియల్ ఎస్టేట్ రంగంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్న నిర్మాణ సంస్థలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) కఠిన చర్యలు చేపట్టింది. ప్రాజెక్టుల పేరుతో కొనుగోలుదారుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేసి, నిర్మాణాలు పూర్తి చేయడంలో జాప్యం చేయడం, ఫ్లాట్లు అప్పగించకపోవడం, రిఫండ్ హామీలను నెరవేర్చకపోవడంపై స్పందించింది. నిబంధనలు పాటించని సంస్థలకు జరిమానాలు విధించడంతోపాటు, కొనుగోలుదారులకు వడ్డీతో సహా డబ్బులు తిరిగి చెల్లించాలని ఆదేశించింది. మంచిరేవులలో రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే 'సనాలి ది ఎడ్జ్' ప్రాజెక్టును ప్రచారం చేస్తున్న సనాలి ఐటీ పార్క్ సంస్థపై అథారిటీ చర్యలు తీసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు రూ.25 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించింది. రెరా రిజిస్ట్రేషన్ పొందే వరకు ప్రాజెక్టుకు సంబంధించిన ప్రకటనలు, బుకింగ్‌లు, విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేసింది. కొనుగోలుదారులకు చెల్లించాల్సిన సొమ్మును తిరిగి ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన సంస్థలకూ రెరా ఆదేశాలు జారీ చేసింది. వాసవి రియల్టర్స్ ఎల్ఎల్పీ రూ.49.50 లక్షలను ఏడాదికి 10.85 శాతం వడ్డీతో సహా చెల్లించాలని పేర్కొంది. త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ రూ.41.85 లక్షలు, ఎస్‌వీఎం ఆదిత్య హోమ్స్ రూ.27.16 లక్షలు, భువన తేజ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రూ.26 లక్షలు, ఆదిత్య స్క్వేర్స్ రూ.17 లక్షలు, బీవీఆర్ ఇన్‌ఫ్రా రూ.7 లక్షలను సంబంధిత కొనుగోలుదారులకు వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని ఆదేశించింది. మియాపూర్‌లోని 'అరైన్ ఎమరాల్డ్' ప్రాజెక్టులో ఫ్లాట్ నంబర్ 502ను కొనుగోలుదారుడికి వెంటనే అప్పగించాలని అరైన్ ఇన్‌ఫ్రా సంస్థను ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేయకపోయినా, ఉల్లంఘించినా రెరా చట్టంలోని సెక్షన్ 63 ప్రకారం అదనపు జరిమానాలతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తాజా నిర్ణయాలతో నిర్మాణ సంస్థల బాధ్యతను నిర్ధారించడంలో, కొనుగోలుదారుల హక్కులను కాపాడడంలో తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.

సమ్మక్క సాగర్‌కు అనుమతులివ్వండి!

మొదటి పేజీ తరువాయి

ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో భవిష్యత్తు నీటి అవసరాలు భారీగా పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతినివ్వాలని, ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతుల సాధనలోనూ సహకరించాలని కోరారు. తొలుత కాంతనపల్లి వద్ద ఈ ప్రాజెక్టును ప్రతిపాదించగా.. 11,408 ఎకరాల భూమి, 17 ఆదివాసీ గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని గుర్తించి, ఆ ముంపు ప్రభావాన్ని తగ్గించేందుకే నిర్మాణ ప్రదేశాన్ని తుపాకులగూడెంకు మార్చినట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ. 9.883 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఏప్రిల్‌లోనే చెల్లించిందని గుర్తుచేశారు. ఈ మేరకు ఐఐటీ ఖరగ్‌పూర్ తన సమగ్ర అధ్యయన నివేదికను జూలై 30నే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించిందని పేర్కొన్నారు. తుపాకులగూడెం వద్ద నిర్మించడం వల్ల ఛత్తీస్‌గఢ్‌లో కేవలం 33 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతాయని, అత్యంత భారీ వరదల సమయంలో కూడా ఈ ప్రభావం వంద ఎకరాలకు మించదని ఆ నివేదికలో స్పష్టమైందని తెలిపారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఈ బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద దీని నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలుగా ఉంది. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాల కోసం గోదావరి జలాలను వినియోగించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములకు సంబంధించి భూసేకరణ, నష్టపరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం పూర్తిగా చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినందున, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎన్ఓసీని వీలైనంత త్వరగా జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.



విద్యుత్ వినియోగంలో ఆల్‌టైమ్ రికార్డు

- తొలిసారిగా 20 వేల మెగావాట్లు దాటిన గరిష్ఠ డిమాండ్
- రెండు కొత్త సబ్‌స్టేషన్లు ప్రారంభం..
- రబీకి ముందస్తు ఏర్పాట్లు
- ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): తెలంగాణ విద్యుత్ రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్ల స్థాయిని అధిగమించింది. సోమవారం (నవంబర్ 16) రాష్ట్రవ్యాప్తంగా 20,018 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదై ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, జలవిద్యుత్ ఉత్పత్తిలో సుమారు 4 వేల మెగావాట్ల లోటు ఉన్నప్పటికీ పెరిగిన అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. గతేడాది నవంబర్ 16న 8,522 మెగావాట్లుగా నమోదైన విద్యుత్ డిమాండ్ ఈ ఏడాది అదే తేదీన 12,802 మెగావాట్లకు పెరిగిందని మంత్రి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 50.2 శాతం వృద్ధి నమోదైందని, అదనంగా 4,280 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసినట్లు వివరించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా తెలంగాణ పవర్ రిపోర్ట్ గణాంకాలను వెల్లడించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో భాగంగా దావూద్‌ఖాన్‌గూడ, బడంగ్‌పేట్ ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. వీటి ద్వారా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపడటంతోపాటు పంపిణీ సామర్థ్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రబీ 2026--27 సీజన్‌లో వ్యవసాయ రంగానికి విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ లభ్యత, డిమాండ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. గృహాలు, వ్యవసాయ రంగం, పరిశ్రమలకు ఎలాంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఉద్రిక్తత

- ప్రధాన గోపుర శిఖరం తొలగింపుపై దుమారం
- ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా పనులంటూ బీజేపీ ఆందోళన
- ఆలయ అభివృద్ధి పనులు నిలిపివేయాలని డిమాండ్
- ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



వేములవాడ/సిరిసిల్ల, నవంబర్ 17 (సమయం న్యూస్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి, విస్తరణ పనులు తీవ్ర వివాదానికి, ఉద్రిక్తతకు దారితీశాయి. మంగళవారం ప్రధాన ఆలయ గోపుర శిఖరం తొలగింపు ప్రక్రియ చేపట్టడం స్థానికంగా కలకలం రేపింది. ఆగమ శాస్త్ర నియమాలకు విరుద్ధంగా, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా గోపుర శిఖరాన్ని తొలగిస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక బీజేపీ నాయకులు ఆలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఆలయ అభివృద్ధి పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేతలకు పాల్పడుతోందని మండిపడుతూ, తలుపులు నెట్టివేసి లోపలికి వెళ్లేందుకు యత్నించారు. వెంటనే వీటీడీఏ అధికారులు, కలెక్టర్ సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని వివరించాలని డినాదాలు చేశారు. ఈ నిరసనలతో రాజన్న ఆలయ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో.. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి పనుల పేరుతో ప్రాచీన కట్టడాలు, ఆగమ సంప్రదాయాలకు నష్టం కలిగించవద్దని డిమాండ్ చేశారు. రాజన్న ఆలయం ఎవరి వ్యక్తిగత జాగీరు కాదని, కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవమని స్పష్టం చేశారు. గర్భగుడిని ముట్టుకోబోమని గతంలో చెప్పిన అధికారులు, ఇప్పుడు గర్భగుడి శిఖరాన్ని తొలగించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. శిఖరం తొలగింపునకు ఎవరు అనుమతి ఇచ్చారు? శృంగేరి పీఠం నుంచి లిఖితపూర్వక అనుమతులు తీసుకున్నారా? అని నిలదీశారు. అనుమతులు ఉంటే వాటిని ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. స్లాబ్ నిర్మాణం వల్ల శిఖరం కనిపించని పరిస్థితి ఏర్పడటానికి కారణాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, ఖర్చులు, కాంట్రాక్టర్ల వివరాలను బహిర్గతం చేయాలన్నారు. దక్షిణామూర్తి విగ్రహం, వెయ్యి స్తంభాల మండపం వంటి ప్రాచీన కట్టడాల పరిరక్షణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ విషయాలపై వాస్తవాలు తెలుసుకునేందుకు త్వరలో బీజేపీ నాయకులు శృంగేరి పీఠాన్ని సందర్శించి పీఠాధిపతులను కలుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు సిరికొండ శ్రీనివాస్, పొన్నాల తిరుపతిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రెగుల సంతోష్ బాబు, కౌన్సిలర్లు వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బధిర మహిళపై గ్యాంగ్ రేప్

అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో ఇద్దరి అరెస్ట్!

హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ బధిర మహిళపై ఇద్దరు వ్యక్తులు సామూహిక లైంగిక దాడికి పాల్పడగా.. పోలీసులు వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో నివసించే ఓ బధిర మహిళను నిందితులు అత్యంత దారుణంగా మోసగించారు. మీ తల్లిదండ్రులకు తీవ్ర అనారోగ్యంగా ఉందని, వెంటనే చూడటానికి వెళ్లాలంటూ ఆమెను నమ్మించి ఆటోలో ఎక్కించుకున్నారు. అయితే తల్లిదండ్రుల వద్దకు కాకుండా ఆమెను ఓ నిర్మానుష్య ప్రాంతానికి బలవంతంగా తరలించారు. అక్కడ ఆమెపై ఇద్దరు నిందితులు సామూహిక లైంగిక దాడికి పాల్పడి పరారయ్యారు. ఈ అఘాయిత్యంతో తీవ్ర మనస్తాపానికి, ఆవేదనకు గురైన బాధితురాలు.. ధైర్యం చేసి కుటుంబ సభ్యుల సహాయంతో నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బధిర మహిళపై అరాచకానికి పాల్పడిన ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుల ఆచూకీని వేగంగా గుర్తించారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు.

భూ వివాదంపై మానకొండూర్ ఎమ్మెల్యేకు

మహిళా ఫిర్యాదు!

15 గుంటల భూమి అన్యాక్రాంతమైందని వెల్లడి ■ న్యాయం చేయాలంటూ వేడుకోలు



ఉద్యమ కెరటం, మానకొండూర్: తనకు న్యాయంగా రావాల్సిన భూమి విషయంలో అన్యాయం జరిగిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన మద్ది మాధవి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆమ వివరాల ప్రకారం.. చెంజర్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 568/ఎ/2లో మొత్తం 2 ఎకరాల 3 గుంటల భూమిని తన మామ మద్ది మల్లయ్య గతంలో కొనుగోలు చేశారని ఆమె తెలిపారు. ఈ భూమిలో తన భర్తకు వాటాగా వచ్చిన 15 గుంటల భూమిపై తనకు హక్కు ఉందని పేర్కొన్నారు. గత 30 సంవత్సరాలుగా ఆ భూమిని సాగు చేసుకుంటూ అనుభవంలో ఉన్నానని, తన భర్త మరణం తర్వాత కూడా ఆ భూమిని కాపాడుకుంటున్నానని తెలిపారు. అయితే, తనకు తెలియకుండా భూమికి సంబంధించిన పత్రాల్లో ఫోర్జరీ చేసి ఇతరుల పేర్లపై పట్టాలు, రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని మాధవి ఆరోపించారు. ఈ వ్యవహారంలో సంబంధిత రెవెన్యూ అధికారుల పాత్రపైనా సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. తన వద్ద భూమికి సంబంధించిన సాదాబైనామా పత్రాలు ఉన్నాయని, తనకు న్యాయంగా రావాల్సిన 15 గుంటల భూమిని తిరిగి ఇప్పించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. భూ వివాదంపై విచారణ జరిపించి, పట్టాలు, రిజిస్ట్రేషన్లను పరిశీలించి తనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వెంటిలేటర్‌పైకి విద్యావ్యవస్థ!

- ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయంపై కవిత తీవ్ర ఆగ్రహం
- విద్యార్థుల స్థానికత హక్కులకు ముప్పు ఉందని ఆరోపణ
- కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేసేందుకేనని విమర్శ



హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ విద్యావ్యవస్థ వెంటిలేటర్‌పైకి వెళ్లిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలోనే విద్యారంగం సంక్షోభంలోకి వెళ్లిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మరింత దిగజారిందని విమర్శించారు. ఇంటర్మీడియట్ బోర్డు రద్దు నిర్ణయం వెనుక తెలంగాణ విద్యార్థుల స్థానికత హక్కులకు నష్టం కలిగించే ప్రయత్నం ఉందని ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో 'ఇంటర్ బోర్డు రద్దు--తెలంగాణ విద్యపై ప్రభావం' అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటర్ బోర్డును రద్దు చేసి 9 నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానం తీసుకురావడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యాసంస్థలకు ప్రయోజనం కల్పించే ప్రయత్నం జరుగుతోందని కవిత ఆరోపించారు. ఏపీలో ప్రవేశం పొందిన విద్యార్థులు హైదరాబాద్‌లో పరీక్షలు రాసి స్థానికులుగా గుర్తింపు పొందే ప్రమాదం ఉందన్నారు. చంద్రబాబు మెప్పు కోసమే రేవంత్ ఈ నిర్ణయం తీసుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు నష్టం కలిగించే నిర్ణయాలను సహించబోమని హెచ్చరించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయం తీసుకునే ముందు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, రాజకీయ పార్టీలతో చర్చించారా అని ప్రశ్నించారు. ఇంటర్ బోర్డు రద్దు వల్ల జూనియర్ కళాశాలలు, అధ్యాపకుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల చదువు మధ్యలో మానేయడాన్ని కారణంగా చూపుతూ బోర్డును రద్దు చేయడం సరికాదన్నారు. ముందు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు. సంస్కరణలు చేపట్టాలంటే కేరళ తరహాలో విస్తృత చర్చలు జరిపి, దశలవారీగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం బిల్లు తీసుకురావాలనుకుంటే ప్రతి జిల్లాలో ముసాయిదాను అందుబాటులో ఉంచి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానికత, పదో తరగతి ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ శాస్త్రీయ ఆధారాలతోనే విద్యా విధానాల్లో మార్పులు చేపట్టాలని సూచించారు. ఇంటర్ విద్య జేఏసీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ బోర్డు రద్దుతో కలిగే ప్రయోజనాలను ప్రభుత్వం వివరించలేదన్నారు. ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ తొందరపాటు నిర్ణయాలు విద్యారంగంలో సంక్షోభానికి దారితీయవచ్చని హెచ్చరించారు. కనిష్క కోచింగ్ అకాడమీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్య ప్రభుత్వ సామాజిక బాధ్యతని, కార్పొరేటీకరణను అరికట్టాలని కోరారు. ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఐక్య పోరాటాలు చేపడతామని కవిత హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాలేవీ?.. రైతుల గోస పట్టదా?

- వడ్లు కొనకపోవడంతో దళారుల చేతుల్లో రైతులు నష్టపోతున్నారు
- దొడ్డు వడ్లకు దిక్కులేదు.. క్వింటాకు పది కిలోల తరుగు
- లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా పరిహారం ఇవ్వడం లేదు
- ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం చెల్లించాలి
- యాసంగి రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి
- కాంగ్రెస్ మూడేళ్ల పాలన నయవంచనకు నిదర్శనం
- ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు



సంగారెడ్డి, నవంబర్ 17 (సమయం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మంగళవారం నిజాంపేట మండల కేంద్రంలో రైతులను కలిసిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని ప్రభుత్వం చెబుతున్నా ఒక్క గింజ కూడా కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. రైతులు 20 రోజులుగా ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నల్లగొండ, నిజామాబాద్ సహా పలు జిల్లాల్లో సన్న వడ్లను క్వింటాకు రూ.2,600 నుంచి రూ.2,700కే విక్రయిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దొడ్డు వడ్లను రూ.2,200కే దళారులు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికితోడు క్వింటాకు పది కిలోల వరకు తరుగు తీస్తుండటంతో రైతులు మరింత నష్టపోతున్నారన్నారు. సన్నాలు సాగు చేయాలని ప్రోత్సహించిన ప్రభుత్వం ఇప్పుడు రైతులను ఆదుకోవడం లేదని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో కోతలు, తరుగు లేకుండా చర్యలు తీసుకోవాలని, బోనస్ చెల్లింపులపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా ప్రభుత్వం ఇప్పటివరకు నష్టాన్ని అంచనా వేయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నాయని, తెలంగాణలోనూ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం చెల్లించాలని కోరారు. యాసంగి రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయడంతోపాటు వ్యవసాయ కూలీలకు హామీ ఇచ్చిన రూ.12 వేలు అందించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా వాయిదాలు, రుణమాఫీ, బోనస్ చెల్లింపుల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నారాయణఖేడ్ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పలు తండాలకు మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదని తెలిపారు. నల్లవాగు, నిజాంసాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించి ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. కరువు కారణంగా నారాయణఖేడ్, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి వలసలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో మృతిచెందిన రైతుల కుటుంబాలకు పరిహారం అందడం లేదని ఆరోపించారు. కొత్త బీమా పథకాల ప్రకటనల కంటే ఇప్పటికే అమలులో ఉన్న పథకాల ప్రయోజనాలను అర్హులకు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మూడేళ్లుగా మోసం చేస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. అభయహస్తం పేరుతో ఇచ్చిన హామీలు చివరకు శూన్యహస్తంగా మారాయని ఎద్దేవా చేశారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథాలతో సమానంగా భావిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఆ మాట నిలబెట్టుకోలేదన్నారు. తొలి మంత్రివర్గ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని, 38 మంత్రివర్గ సమావేశాలు జరిగినా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుంటే ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు.

హైదరాబాద్‌ను రెండో వ్యాపార కేంద్రంగా మలచుకోండి

- తెలంగాణలో పెట్టుబడులకు గుజరాత్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఈవీ, ఏరోస్పేస్ రంగాల్లో అవకాశాలు
- భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా పారిశ్రామిక జోన్లు
- భారీ ప్రాజెక్టులకు 15 రోజుల్లో అనుమతులు, ప్రత్యేక అధికారి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



అహ్మదాబాద్, నవంబర్ 17: గుజరాత్ పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను తెలంగాణకు విస్తరించి హైదరాబాద్‌ను దక్షిణ భారతదేశంలో మరో ప్రధాన వ్యాపార కేంద్రంగా మలచుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో భాగంగా ఫిక్కీతో కలిసి అహ్మదాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏరోస్పేస్, రక్షణ, ఐటీ రంగాల్లో తెలంగాణలో విస్తృత పెట్టుబడి అవకాశాలున్నాయని తెలిపారు. గుజరాత్ నుంచి పెట్టుబడులను ఆకర్షించడం తమ ఉద్దేశం కాదని, అక్కడి వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు తెలంగాణను మరో కేంద్రంగా ఎంచుకోవాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్లకు 1,200 ఎకరాలు, ఎలక్ట్రానిక్స్, తయారీ పరిశ్రమలకు మరో 1,200 ఎకరాలు, ఈవీ, ఇంధన నిల్వ వ్యవస్థలకు 800 ఎకరాలకు పైగా కేటాయించినట్లు వెల్లడించారు. ఏఐ సిటీ, విద్యా కేంద్రంతోపాటు 15 వేల ఎకరాలకు పైగా పచ్చదనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ విలువ 189 బిలియన్ డాలర్లకు చేరిందని, గత ఏడాది 10.75 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. టీజీ-ఐపాస్ ద్వారా భారీ పరిశ్రమలకు 15 రోజుల్లో అనుమతులు ఇస్తున్నామని, 98 శాతం దరఖాస్తులను గడువులోగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. గుజరాత్ నుంచి పెట్టుబడులు పెట్టే ప్రతి సంస్థకు ప్రత్యేక అధికారిని నియమించి, పరిశ్రమ ప్రారంభమయ్యే వరకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామిక భూములపై 100 శాతం స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, ఏడేళ్లపాటు 75 శాతం వరకు ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్ కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047లో భాగంగా క్యూర్, ప్యూర్, రేర్ విధానాలతో పట్టణ, పట్టణ పరిసర, గ్రామీణ ప్రాంతాల్లో సమతుల్య ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. గ్లోబల్ సమ్మిట్‌లో సుమారు 100 అంతర్జాతీయ ఏరోస్పేస్, రక్షణ సంస్థల భాగస్వామ్యంతో రక్షా ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలు పరస్పర బలాలను వినియోగించుకుని దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని శ్రీధర్‌బాబు కోరారు.



'డబుల్' ఇండ్ల ఆకస్మిక తనిఖీల సమాచారం లీక్ వ్యవహారంలో డీఈఈ సస్పెన్షన్

హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): డబుల్ బెడ్ రూం ఇండ్లలో అసలైన లబ్ధిదారులే నివాసం ఉంటున్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు హౌసింగ్ అధికారులు నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీల సమాచారాన్ని ముందుగానే లబ్ధిదారులకు లీక్ చేసిన హౌసింగ్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ) చంద్రపాల్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలతో నిర్మించి ఉచితంగా కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు అర్హులైన లబ్ధిదారులకే ఉపయోగపడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లను ఇతరులకు అద్దెకు ఇవ్వడం, విక్రయించడం లేదా లబ్ధిదారులు నివాసం ఉండకుండా ఇతరుల ఆధీనంలో ఉంచడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఇలాంటి అక్రమ కేటాయింపులను గుర్తించి నిబంధనల ప్రకారం రద్దు చేసేందుకు నోటీసులు జారీ చేయడంతోపాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి కొల్లూరులో డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించినప్పటికీ చాలామంది లబ్ధిదారులు అక్కడ నివాసం ఉండటం లేదన్న ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో హౌసింగ్ అధికారులు ఇప్పటికే పలుమార్లు తనిఖీలు నిర్వహించి నివాసం ఉండని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులకు సమాధానంగా తాము కేటాయించిన ఇళ్లలోనే నివసిస్తున్నామని పలువురు లబ్ధిదారులు పేర్కొనడంతో వాస్తవ పరిస్థితిని నిర్ధారించేందుకు ఆకస్మిక తనిఖీలను మరింత విస్తృతం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో సెలవు రోజైన ఆదివారం పెద్ద ఎత్తున ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందించారు. హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న డీఈఈ చంద్రపాల్ ఈ తనిఖీలకు సంబంధించిన సమాచారాన్ని లబ్ధిదారులకు లీక్ చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా తనిఖీల సమాచారం లీక్ అయినట్లు నిర్ధారణ కావడంతో విధుల్లో నిర్లక్ష్యం, అధికారిక సమాచార గోప్యతను పాటించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. దీంతో డీఈఈ చంద్రపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఎండీ ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ప్రభుత్వ లక్ష్యాలకు విరుద్ధంగా వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

రాజీనే రాజమార్గం..

పోలీసు పదోన్నతులకు లైన్ క్లియర్!

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లపై డీజీపీ ఆనంద్ ప్రత్యేక చొరవ

1991, 1995, 1996 బ్యాచ్‌ల పదోన్నతి జాబితాలు సిద్ధం

హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): పోలీసు శాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అధికారుల పదోన్నతుల సమస్యకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. సీనియారిటీ, రోస్టర్ విధానం, ఖాళీలు, అర్హతలపై నెలకొన్న వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు డీజీపీ సి.వి.ఆనంద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కోర్టు కేసుల కారణంగా అర్హులైన అధికారులు పదోన్నతులు కోల్పోకుండా ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రయత్నించారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో 1991, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వరంగల్, హైదరాబాద్ రేంజ్‌లతోపాటు హైదరాబాద్ నగరానికి చెందిన అధికారులు పాల్గొని పదోన్నతులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. తొలి విడతలో 54 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు ఖాళీలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు వివరించారు. రెండో విడతలో 2027 ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ మేరకు మూడు బ్యాచ్‌లకు సంబంధించిన పదోన్నతి ప్యానళ్లను సిద్ధం చేశారు. గతంలో జారీ చేసిన జీవో నంబర్ 74 ప్రకారం పదోన్నతులు చేపట్టే క్రమంలో సీనియారిటీపై అభ్యంతరాలు తలెత్తడంతో ప్రక్రియ నిలిచిపోయింది. తాజా సమావేశంలో కమిటీ నివేదికలు, ప్రభుత్వ ఉత్తర్వులు, రోస్టర్ నిబంధనలను సమీక్షించి ప్రతిపాదిత జాబితాలపై అధికారుల మధ్య ఏకాభిప్రాయం సాధించారు. ప్రస్తుతం ఎలాంటి న్యాయపరమైన వివాదాలు లేని 12 నాన్ కేడర్ ఎస్పీ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. సంబంధిత ప్యానల్ సంవత్సరంలో మరో 10 పోస్టులు కేటాయించే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న ఖాళీలు, అర్హతలు, సీనియారిటీ, రోస్టర్ వివరాలను డీజీపీ కార్యాలయ అధికారులు దృశ్య ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రతిపాదిత పదోన్నతి జాబితాల ప్రకారం ముందుకు వెళ్లేందుకు సమావేశంలో పాల్గొన్న అధికారులు అంగీకారం తెలిపారు. సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేస్తామని డీజీపీ ఆనంద్ తెలిపారు. వివాదాలు, కోర్టు కేసులు దీర్ఘకాలం కొనసాగితే ముఖ్యంగా పదవీ విరమణకు చేరువలో ఉన్న అధికారులు నష్టపోతారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి అధికారికి నిబంధనల ప్రకారం న్యాయం జరగాలన్నదే పోలీసు శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. సమావేశంలో మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ ఎం.భగవత్, అదనపు డీజీలు అకున్ సబర్వాల్, విజయ్‌కుమార్, ఐజీలు షానవాజ్ ఖాసీం, కార్తికేయ, చందనా దీప్తి తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



సంపాదకీయం



అభివృద్ధి అంకెల వెనుక.. అంతుచిక్కని సామాన్యుడి వ్యథ!

ఒకవైపు దేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా దూసుకుపోతోందంటూ పాలకుల గొప్పలు.. ఇంకోవైపు కిరాణా కొట్టులో సరుకుల ధరలు చూసి గుండె గుభేల్మంటున్న సగటు మనిషి బతుకు! పత్రికల్లో అచ్చయ్యే ప్రగతి గణాంకాలకు, సామాన్యుడి ఇంట్లో నెలాఖరుకు మిగిలే చిల్లర పైసలకు మధ్య ఎక్కడా పొంతన కుదరని దుస్థితి ఇది. ఆకాశాన్ని అంటుతున్న ధరల మంటలో మధ్యతరగతి బతుకు నిశ్శబ్దంగా కాలిపోతోంది. నెల మొదటి రోజున చేతికొచ్చిన జీతం చూసి మురిసిపోవాలా.. లేక నెలాఖరు వరకు ఆ జీతంతో బండి ఎలా లాగాలన్న ఆందోళనతో కుమిలిపోవాలా అన్నది నేటి సామాన్య కుటుంబాల దయనీయ పరిస్థితి. ఒకప్పుడు కనీస అవసరాలు తీర్చుకుని భవిష్యత్తు కోసం కనీసం కొద్దిపాటైనా పొదుపు చేసుకునే కుటుంబాలు.. ఇప్పుడు ఏ ఖర్చును కోత కోసుకుంటే బతుకు బండి సాగుతుందోనని రోజూ లెక్కలు వేసుకుంటున్నాయి. కాగితాలపై కనిపిస్తున్న ఆర్థిక వికాసం నిజ జీవితంలో ఎందుకు సాక్షాత్కరించడం లేదన్నదే ఇప్పుడు సమాజాన్ని తొలుస్తున్న అతిపెద్ద ప్రశ్న.

గణాంకాలకే పరిమితమైన ప్రగతి..

నిత్యావసరాల ధరల పెరుగుదల తీవ్రత ఏ స్థాయిలో ఉందన్నది తాజా ప్రభుత్వ లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. అక్టోబర్ 2026 నాటికి దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 6.09 శాతానికి చేరుకోగా, ఆహార ద్రవ్యోల్బణం ఏకంగా 8.94 శాతంగా నమోదైంది. గత నెలతో పోలిస్తే ఇది అత్యంత ఆందోళనకరమైన పెరుగుదల. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ద్రవ్యోల్బణం 6.63 శాతంగా ఉండటం పల్లె బతుకులపై పడుతున్న భారాన్ని కళ్లకు కడుతోంది. ఏసీ గదుల్లో కూర్చుని లెక్కలు కట్టే ఆర్థికవేత్తలకు ఈ శాతాలు సులువుగానే అర్థం కావొచ్చు. కానీ కూలీనాలీ చేసుకునే సామాన్యుడికి ఈ అంకెల గారడీతో పనేంటి? వంద రూపాయలు పట్టుకెళ్తే మార్కెట్‌లో కూరగాయల సంచి ఎందుకు నిండటం లేదన్నదే అతని అసలైన ఆవేదన. నెలకు సరిపడే సరుకులు పదిహేను రోజులకే ఎందుకు అడుగంటుతున్నాయి? పిల్లల చదువు, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ, ఇంటి అద్దె, కరెంటు బిల్లు, ప్రయాణ ఖర్చులు, చేసిన అప్పులకు నెలవారీ వాయిదాలు చెల్లించిన తర్వాత.. చేతిలో చిల్లిగవ్వ ఎందుకు మిగలడం లేదు? అన్నదే అతను ప్రతిక్షణం అనుభవిస్తున్న నిజమైన ద్రవ్యోల్బణం.

ఆదాయం ఆవగింజ.. ఖర్చులు కొండంత!

ఉద్యోగికి వార్షిక వేతన పెంపు పేరుతో ఏటా కాస్తో కూస్తో జీతం పెరిగినా.. అదే సమయంలో నిత్యావసరాలు, విద్య, వైద్యం, రవాణా ఖర్చులు అంతకు మించి రెట్టింపు వేగంగా పెరిగితే ఆ పెంపునకు అర్థమేముంటుంది? అంకెల రూపంలో జీతం పెరగడం ముఖ్యం కాదు.. ఆ జీతంతో కొనగలిగే వస్తువుల పరిమాణం పెరగడమే నిజమైన ఆర్థిక భద్రత. నేటి మధ్యతరగతి కుటుంబాలు చదువు, వైద్యం లాంటి అత్యవసరాల కోసం చేసే ఖర్చు భరించలేక నానా అవస్థలు పడుతున్నాయి. ఏ చిన్న కష్టం వచ్చినా అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన దుస్థితి నెలకొంది. పొదుపు అన్న పదం సామాన్యుడి నిఘంటువులో నుంచి శాశ్వతంగా కనుమరుగవుతోంది.

రైతుకు, వినియోగదారుడికి.. ఇద్దరికీ అన్యాయమే..

ధరల పెరుగుదలపై చర్చించేటప్పుడు దేశానికి అన్నం పెడుతున్న రైతును విస్మరించడం ఏమాత్రం సరికాదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు రైతుకు కనీస గిట్టుబాటు ధర దక్కడం లేదు. అదే సమయంలో ఆ పంటను కొనుక్కుని తినే వినియోగదారుడికి సరసమైన ధరకు ఆహారం అందడం లేదు. వాస్తవానికి ఇక్కడ లాభపడుతున్నది కేవలం మధ్యవర్తులే. రైతు వద్ద అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి, అదే సరుకును వినియోగదారుడికి అమాంతం పెంచేసి విక్రయిస్తున్న దళారీ వ్యవస్థను అరికట్టడంలో ప్రభుత్వాలు దారుణంగా విఫలమవుతున్నాయి. మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలి. ధరలు ఆకాశాన్ని అంటిన తర్వాత ఉత్తుత్తి సమీక్షలు చేసి చేతులు దులుపుకోవడం కాదు.. ముందస్తుగానే ధరలను అదుపు చేసే పటిష్టమైన యంత్రాంగం కావాలి.


అసలైన అభివృద్ధి కొలమానం అదే..

లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి.. జీడీపీ అంకెలు పరుగులు తీస్తున్నాయి.. అన్న ప్రభుత్వాల ప్రకటనలు పైకి వినసొంపుగానే ఉండొచ్చు. కానీ నెల జీతం తీసుకునే ఓ సామాన్య కుటుంబం నెలాఖరుకు కనీసం కాస్తయినా మిగుల్చుకోగలుగుతోందా? అన్న ప్రశ్నకు పాలకుల వద్ద కచ్చితమైన సమాధానం ఉండాలి. ఆ సమాధానం ప్రతికూలంగా ఉంటే.. అసలు ఈ అభివృద్ధి ఫలాలు సమాజంలో ఎవరికి అందుతున్నాయన్న ప్రశ్న తలెత్తక మానదు. ప్రభుత్వాలు ధరల నియంత్రణను కేవలం ఒక ఆర్థిక విధానంగా మాత్రమే చూడకూడదు. దానిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. సామాన్యుడి జీతం కాగితంపై ఎంత పెరిగిందన్నది కాదు.. ఆ వచ్చిన జీతంతో అతని కుటుంబం సమాజంలో ఎంత గౌరవంగా బతకగలుగుతోందా అన్నదే అసలు సిసలైన కొలమానం. పాలకుల దృష్టిలో బలమైన ఆర్థిక వ్యవస్థ అంటే కేవలం షేర్ మార్కెట్ లాభాలు కాదు.. అప్పుల్లేని బలమైన సామాన్య కుటుంబం అని ప్రభుత్వాలు గుర్తించినప్పుడే దేశంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది

పోటీ కాదు.. సహకారమే మన భవిష్యత్తు!

- భారత్-ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు
- ప్రపంచ జనాభాలో నాలుగో వంతుకు ప్రాతినిధ్యం
- శాంతి, స్థిరత్వం, సమృద్ధి అభివృద్ధే లక్ష్యం





మనీలా, నవంబర్ 17 (సమయం న్యూస్): భారత్–ఆసియాన్ దేశాల కూటమి కలిసి ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, కాబట్టి మన ఉమ్మడి భవిష్యత్తును కేవలం పోటీ కాకుండా పరస్పర సహకారమే నిర్దేశించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన ఇండియా–ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో 11 సభ్య దేశాల నేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ భాగస్వామ్యంలో ఆసియాన్ ఐక్యత, దాని కీలక భూమికకు భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. గడిచిన కొన్నేళ్లుగా ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటోందని, నేడు ప్రపంచానికి అత్యంత అవసరమైనది శాంతి, స్థిరత్వం, ఊహించదగిన భవిష్యత్తు అని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సదస్సు ప్రధాన ఇతివృత్తమైన 'నావిగేటింగ్ అవర్ ఫ్యూచర్, టుగెదర్' (మన భవిష్యత్తును సంయుక్తంగా మార్గనిర్దేశం చేసుకోవడం) అనే అంశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని శాంతి, స్థిరత్వానికి చిహ్నంగా మార్చే శక్తి, సంకల్పం భారత్, ఆసియాన్ రెండింటికీ ఉన్నాయని ఆయన అన్నారు. భారతదేశ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానితో ఒకటి లోతుగా ముడిపడి ఉన్నాయని మోదీ ఉద్ఘాటించారు. రాబోయే సంవత్సరాల్లో 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045', 'వికసిత భారత్ 2047' లక్ష్యాలు మన ఉమ్మడి ఆకాంక్షలను నెరవేర్చడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశం మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడంతో పాటు, సురక్షితమైన, సమ్మిళిత, సంపన్నమైన ఇండో–పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 1967లో ఏర్పాటైన ఆసియాన్ కూటమి ఆగ్నేయాసియా దేశాల మధ్య ఆర్థిక వృద్ధి, రాజకీయ స్థిరత్వం, భద్రత, సాంస్కృతిక సహకారాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, తైమూర్–లెస్టే, వియత్నాం సహా మొత్తం 11 దేశాలు ఇందులో సభ్య దేశాలుగా ఉన్నాయి.

వాళ్లు సైన్స్ తెలియని మూర్ఖులు

ఇథనాల్ బ్లెండింగ్‌పై కేంద్ర మంత్రి సురేశ్ గోపీ సంచలన వ్యాఖ్యలు

శాస్త్రీయ పరిశోధనల తర్వాతే ఈ20 విధానం అమలు

ఇథనాల్ మిశ్రమంపై దుష్ట రాజకీయాలు చేస్తున్నారని విమర్శ

అనుమానాలుంటే పెట్రోల్‌ను పరీక్షించుకోవచ్చని సవాల్



త్రిస్సూర్, నవంబర్ 17 (సమయం న్యూస్): పలు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సరఫరా చేస్తున్న పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్ (కలపడం) నిర్దేశిత 20 శాతం పరిమితిని మించుతోందంటూ వస్తున్న ఆరోపణలను కేంద్ర మంత్రి సురేశ్ గోపీ తీవ్రంగా ఖండించారు. అటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్న వారిని 'సైన్స్ తెలియని మూర్ఖులు'గా అభివర్ణించారు. కేరళలోని త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పెట్రోల్ వాహనాల ద్వారా వెలువడే కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇథనాల్‌ను కలపడం ఒక్కటే ప్రస్తుతం ఉన్న మార్గమని స్పష్టం చేశారు. విస్తృత శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించిన అనంతరమే.. 'ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (ూూ=ూూ×) ఆమోదంతో భారత్‌లో జు10 నుంచి జు20 ఇథనాల్ బ్లెండింగ్‌కు మారినట్లు సురేశ్ గోపీ గుర్తుచేశారు. ఇథనాల్ కలపడం వల్ల ఇంజిన్లు దెబ్బతిన్నాయని ఇప్పటివరకు ఎలాంటి బీమా (ఇన్సూరెన్స్) క్లెయిమ్‌లు రాలేదన్నారు. "ఇథనాల్ బ్లెండింగ్‌పై ప్రస్తుతం అనేక దుష్ట రాజకీయాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇథనాల్ మిశ్రమం నిర్దేశిత పరిమితిని దాటిపోయిందనే తప్పుడు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వాదనలు చేస్తున్నవారిలో ఎవరికీ సైన్స్ గురించి కనీస అవగాహన లేదు" అని ఆయన మండిపడ్డారు. పెట్రోల్‌లోని ఇథనాల్ శాతాన్ని ఎవరైనా, ఎప్పుడైనా పరీక్షించుకోవచ్చని, అలాంటి తనిఖీలను తాను ఏమాత్రం వ్యతిరేకించనని సురేశ్ గోపీ తెలిపారు. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం ఖచ్చితంగా 20 శాతానికి చేరుకోగానే, ఆటోమేటిక్‌గా వాల్వ్ ఆగిపోయేలా యంత్రాల సాంకేతిక వ్యవస్థ ఉంటుందని.. ఏ పెట్రోల్ బంకు నుంచైనా లభించే గరిష్ఠ ఇథనాల్ శాతం ఇదేనని ఆయన వివరించారు.

ఆటో డ్రైవర్‌గా బ్రిటన్ యువరాజు..

ప్రయాణికురాలిగా యువరాణి!

ముంబయిలో ప్రిన్స్ విలియం, కేట్ మిడిల్టన్ సందడి



ముంబయి, నవంబర్ 17 (సమయం న్యూస్): బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, యువరాణి కేట్ మిడిల్టన్ ఆటోలో ప్రయాణించినట్లు వెలువడిన వార్త ఆసక్తికరంగా మారింది. భారత్ పర్యటనలో భాగంగా మంగళవారం ముంబయిలోని బాంద్రా రెక్లమేషన్ గార్డెన్‌ను సందర్శించిన రాజదంపతులు మహీంద్రా సంస్థకు చెందిన విద్యుత్ ఆటోలో ప్రయాణించినట్లు సమాచారం. ప్రిన్స్ విలియం స్వయంగా ఆటో నడపగా, కేట్ మిడిల్టన్ వెనుక సీటులో కూర్చున్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఎర్త్‌షాట్ ప్రైజ్--2026కు ఎంపికైన తుది పోటీదారులతో సమావేశమయ్యారు. పర్యావరణ సమస్యలకు వినూత్నమైన, ఆచరణాత్మక పరిష్కారాలను ప్రోత్సహించేందుకు ప్రిన్స్ విలియం 2020లో ఎర్త్‌షాట్ ప్రైజ్‌ను ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ప్రకృతి వనరుల సంరక్షణకు కృషి చేస్తున్న ఆవిష్కర్తలను ఈ పురస్కారం ద్వారా ప్రోత్సహిస్తారు. భారత్‌లో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ వాహనాల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తూ రాజదంపతులు ఆటోలో ప్రయాణించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచినట్లు కథనాలు వెల్లడించాయి.

దాడికి ముందే రెక్కీ..

సీసీ కెమెరాల్లో ఉగ్రవాదుల కదలికలు!

సీఆర్‌పీఎఫ్ బలగాలపై దాడికి ముందే పక్కాప్రణాళిక

ఎదురుకాల్పుల్లో ఉమర్ నిసార్ దార్ హతం

శ్రీనగర్, నవంబర్ 17 (సమయం న్యూస్): జమ్ముకశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ముందుగానే రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ లతీఫ్ భట్, అతడి సహాయకుడు ఉమర్ నిసార్ దార్ దాడికి ముందు పలు ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని పోలీసులు గుర్తించారు. నవంబర్ 11న కుల్గామ్ జిల్లాలోని అఖ్రాన్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్ట్‌పై జరిగిన దాడికి ముందు రోజు వీరిద్దరూ రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. నవంబర్ 10న లతీఫ్ భట్, ఉమర్ నిసార్ దార్ కలిసి మీర్‌బజార్, అఖ్రాన్, హబ్లిష్, కిలామ్ ప్రాంతాల్లో తిరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా గుర్తించారు. భద్రతా బలగాల కదలికలను పరిశీలించడంతోపాటు దాడికి అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు వీరు రెక్కీ నిర్వహించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. నవంబర్ 11న అఖ్రాన్ సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్ట్‌పై జరిపిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. దాడి అనంతరం ఉగ్రవాదులు అక్కడి నుంచి పారిపోయిన దృశ్యాలు కూడా కెమెరాల్లో నమోదైనట్లు తెలిపారు. కాగా, నవంబర్ 16న కుల్గామ్ జిల్లాలో ఉగ్రవాదుల కదలికలను గుర్తించిన భద్రతా బలగాలు గాలింపు చేపట్టగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఉమర్ నిసార్ దార్ హతమయ్యాడని అధికారులు వెల్లడించారు. లష్కరే కమాండర్ లతీఫ్ భట్ మాత్రం గాయాలతో తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. అతడిని పట్టుకునేందుకు భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఉగ్రవాదుల కదలికలు, దాడి వెనుక ఉన్న ప్రణాళికపై దర్యాప్తు కొనసాగుతోంది.



గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి ఆ రెస్టారెంట్‌కు వెళ్లా!

అమ్మానాన్న తొలిసారి కలుసుకున్న చోటుకే ప్రేయసితో..

తన గత జ్ఞాపకాలను పంచుకున్న రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర జ్ఞాపకాన్ని పంచుకున్నారు. గతంలో తన ప్రేయసితో కలిసి బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉన్న ఓ రెస్టారెంట్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. ఆ రెస్టారెంట్‌లోనే తన తల్లిదండ్రులు రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ తొలిసారి కలుసుకున్నారని తెలిపారు. సోనియా గాంధీ జీవిత విశేషాలకు సంబంధించిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. చాలా సంవత్సరాల క్రితం తన ప్రేయసితో కలిసి కేంబ్రిడ్జ్‌లోని ఓ రెస్టారెంట్‌కు వెళ్లానని, అక్కడికి వెళ్లే వరకు ఆ ప్రదేశానికి తన కుటుంబంతో ఉన్న అనుబంధం ఆమెకు తెలియదని రాహుల్ వివరించారు. రెస్టారెంట్‌కు వెళ్లిన తర్వాత తన తల్లిదండ్రులు తొలిసారి అక్కడే కలుసుకున్న విషయాన్ని ఆమెకు చెప్పినట్లు గుర్తుచేసుకున్నారు. అయితే ఆ ప్రేయసి ఎవరన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. గతంలో రాహుల్ వ్యక్తిగత జీవితం, వివాహంపై అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. 2004లో వెరోనిక్ అనే స్పెయిన్‌కు చెందిన మహిళ తనకు అత్యంత సన్నిహిత మిత్రురాలని రాహుల్ వెల్లడించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే తాజా వ్యాఖ్యల్లో ప్రస్తావించిన వ్యక్తి ఆమెనేనా అన్న విషయంపై స్పష్టత లేదు. గతంలో పలువురితో రాహుల్ వివాహం జరగబోతోందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగినప్పటికీ అవి ధ్రువీకరణకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో తన తల్లిదండ్రుల ప్రేమకథతో ముడిపడిన ఓ వ్యక్తిగత జ్ఞాపకాన్ని రాహుల్ పంచుకోవడం ఆసక్తికరంగా మారింది.

మారుతున్న 'పేట' ముఖచిత్రం.. అభివృద్ధి బాటలో అడుగులు

- ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలే లక్ష్యంగా...ప్రగతి పనులపై ప్రత్యేక దృష్టి!
- సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్

నర్సంపేట, నవంబర్ 17 (సమయం న్యూస్)



పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నర్సంపేటలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ తెలిపారు.నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల కారణంగా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో నర్సంపేట పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎలకంటి విజయ్‌కుమార్, సలావుద్దీన్ అయూబ్ ఖాన్, శ్రీరామోజు రోజారాణి, మున్సిపల్ సిబ్బంది బొల్లెపెల్లి శ్రావణ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ములుకల మనీష్, కాంగ్రెస్ నాయకులు బొమ్మేరబోయిన ప్రేమ్‌కృష్ణ, మచ్చకంటి పాల్గొన్నారు.

నవీన ఆదర్శ ప్లే & హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు ఘనంగా నిర్వహణ..

కోడంగల్ మున్సిపల్,నవంబర్,17(సమయం న్యూస్)



కొడంగల్ పట్టణ కేంద్రంలోని నవీన ఆదర్శ ప్లే & హైస్కూల్,లో లీగల్ అవేర్‌నెస్ డే (న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును)ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, తమ హక్కులు మరియు బాధ్యతలను తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.ఈ కార్యక్రమానికి కొడంగల్ కోర్ట్ అడ్వకేట్ లీగల్ అడ్వైజర్ కౌన్సిల్ రమేష్, అడ్వకేట్ శివకుమార్, సునీత, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వారు విద్యార్థులకు పలు ముఖ్యమైన చట్టపరమైన అంశాలపై న్యాయ సలహాలు, అవగాహన కల్పించారు.ప్రత్యేకంగా ఫోకస్ చట్టం గురించి,రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, రహదారిపై పాటించాల్సిన జాగ్రత్తలు, చట్టాలను గౌరవించడం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డా. డి.వి. నరేష్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, పాఠశాల వ్యవస్థాపకులు డి. లక్ష్మి వెంకటయ్య, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులకు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దవచ్చని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులు న్యాయ అవగాహనకు సంబంధించిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.“చట్టాలను తెలుసుకుందాం - హక్కులను కాపాడుకుందాం - బాధ్యతలను పాటిద్దాం” అనే సందేశంతో న్యాయ అవగాహన దినోత్సవ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

విద్యార్థులకు భద్రతపై అవగాహన కల్పించిన పరిగి "షీ" టీమ్

- విస్డమ్ హైస్కూల్‌లో మహిళలు, బాలల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు
- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రో ఐపీఎస్,డిఎస్పీ శ్రీనివాస్ అదేశాలమేరకు

పూడూరు మండలం నవంబర్,17(సమయం న్యూస్)



మహిళలు, బాలల భద్రతే లక్ష్యంగా పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రో (ఐపీఎస్), పరిగి డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు పూడూరు మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న విస్డమ్ హైస్కూల్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది.“షీ” టీమ్ ఇన్‌చార్జి నరసింహులు, సిబ్బంది విద్యార్థులకు మహిళలు, బాలలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం గురించి వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సీసీ కెమెరాల ప్రాధాన్యం, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ట్రాఫిక్ నిబంధనలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన, జెండర్ ఈక్వాలిటీ, జెండర్ సెన్సిటివిటీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, 112, "షీ" టీమ్ నంబర్ 181, యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 1908, సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930, చైల్డ్‌లైన్ 1098 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గౌస్ పటేల్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, "షీ" టీమ్ సభ్యులు సావిత్రి, శోభ పాల్గొన్నారు.

వచ్చే మార్చి కల్లా నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్

ఖమ్మం, నవంబర్ 17 : (సమయం న్యూస్)



వచ్చే మార్చి కల్లా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. మంగళవారం మధిర నియోజకవర్గం బోనకల్ మండలం లక్ష్మీపురం లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు.నిర్మాణాల్లో అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మాణం పూర్తయిందన్నారు. ఆకాడమిక్ 4 బ్లాకుల్లో 3 బ్లాకులు పూర్తయి, ఫినిషింగ్ పనులు జరుగుతున్నట్లు, ఒక బ్లాక్ సెంట్రింగ్ వర్క్ పురోగతిలో ఉందన్నారు. సీనియర్ హాస్టళ్లు 9 లో 5 హాస్టళ్లు పూర్తవగా, ఒకటి మోంట్రింగ్ పురోగతిలో ఉండగా, 3 హాస్టళ్ల నిర్మాణాలు ప్లింత్ లెవెల్ పూర్తయ్యాయని అన్నారు. జూనియర్ 4 హాస్టళ్లకు సంబంధించి స్లాబ్ లు పూర్తయి, ఫినిషింగ్ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. కిచెన్ కం డైనింగ్ హాల్ సెంట్రింగ్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. గ్రౌండ్ లెవెల్ సంప్, ఓహెచ్ఎస్ఆర్ పనులు పురోగతిలో ఉన్నట్లు, టీచింగ్ స్టాఫ్ క్వార్టర్స్ ఎర్త్ వర్క్ పనులు జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతర్గత రోడ్లు పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో ఎక్కడ ఆలస్యం అలసత్వం ఉండకూడదని గుత్తేదారులకు, అధికారులకు తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణ కార్మికుల సంఖ్యను పెంచుకుని, పనులను మరింత వేగవంతం చేసి, మార్చి కల్లా పూర్తి స్థాయిలో పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, డిఇ నాగేశ్వర చారి, ఏఇ నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం సమగ్ర అభివృద్ధికి జపాన్ నమూనాల అధ్యయనం

- జపాన్ అభివృద్ధి నమూనాల అధ్యయనంతో భద్రాద్రి కొత్తగూడెం సమగ్ర అభివృద్ధికి కృషి
- జపాన్‌లో అధ్యయన పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 17:




భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా జపాన్‌లో అమలవుతున్న ఆధునిక అభివృద్ధి విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన పరిపాలనా పద్ధతులను జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యయనం చేస్తున్నారు.నీతి ఆయోగ్-జైకా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ అండ్ బ్లాక్స్ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 15 నుంచి 21 వరకు జపాన్‌లో నిర్వహిస్తున్న అధ్యయన పర్యటనలో కలెక్టర్ పాల్గొంటున్నారు.పర్యటనలో విద్య, వైద్యం, పోషకాహారం, వ్యవసాయం, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు, స్థానిక సంస్థల పనితీరు,ప్రజా సేవల నిర్వహణ తదితర రంగాల్లో జపాన్ అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలిస్తున్నారు.జిల్లాలోని ఆస్పిరేషనల్ బ్లాక్‌తో పాటు ఇతర వెనుకబడిన ప్రాంతాల్లో ఈ విధానాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అమలు చేసే అవకాశాలను కలెక్టర్ అధ్యయనం చేస్తున్నారు. పర్యటన ద్వారా పొందిన అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఉత్తమ విధానాలను జిల్లాలో అన్వయించి ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేలా చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.

ఎలాంటి లోపాలకు తావులేకుండా తుది ఓటరు జాబితా రూపొందించాలి

- పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ దిశానిర్దేశం

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 17:-



ఎలాంటి తప్పులు, లోపాలకు తావులేకుండా పారదర్శకంగా తుది ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరం నుండి ఈఆర్వోలు, ఏ ఈ ఆర్ఓలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియపురోగతి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏఎస్‌డిడి (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ , డూప్లికేట్) ఓటర్లకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించినందున క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి,ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన వారి దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను ఈ నెల 21వ తేదీలోగా పూర్తి చేయాలని, పరిశీలనలో అర్హులుగా తేలిన వారిని ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటర్లకు సంబంధించి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులా? అనర్హులా? అనే అంశాన్ని స్పష్టంగా నిర్ధారించి తుది నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్లకు సంబంధించి ప్రతి కేసుకు పూర్తి ఆధారాలు, సంబంధిత పత్రాలతో ప్రత్యేక ఫైళ్లను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో అవసరమైనప్పుడు పరిశీలించేందుకు వీలుగా ప్రతి అభ్యర్థికి సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండాలని తెలిపారు ఫోటో మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి పెండెన్సీ లేకుండా పూర్తి చేయాలని, అదేవిధంగా ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంగీత, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు,ఎన్నికల విభాగం పాల్గొన్నారు.

అగ్గనూర్ వాసులకు సీఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ

- శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్. పట్నం మహేందర్ రెడ్డి

యాలాల మండలం, నవంబర్,17(సమయం న్యూస్)

అనారోగ్యంతో ఆసుపత్రి పాలై చికిత్స కోసం వేలాది ఖర్చుపెట్టిన బాధితులకు శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అండగా నిలిచారు. యాలాల్ మండలం అగ్గనూరు పంచాయతీ పరిధిలోని మల్లారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఉద్యర నందిని కుటుంబానికి రూ. 37,500 అలాగే అంజిలమ్మ కుటుంబానికి రూ. 18,000 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మహేందర్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. ప్రభుత్వం అందించిన సహాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసంద్, మైపాల్, హనుమంతు ఆయనతో ఉన్నారు.



తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. అభివృద్ధిలో భాగస్వాములు కండి

- గుజరాత్ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం

అహ్మదాబాద్, నవంబర్ 17:

తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గుజరాత్ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 లక్షల కోట్ల డాలర్లకు చేర్చే లక్ష్యంతో ‘తెలంగాణ రైజింగ్2047’ విజన్‌ను రూపొందించామని తెలిపారు.అహ్మదాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం, ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026’ రోడ్‌షోలో మంత్రి పాల్గొన్నారు. వివిధ రంగాల పారిశ్రామిక వేత్తలతో పెట్టుబడులు, వ్యాపార విస్తరణపై చర్చించారు.డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరై తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని కోరారు. ‘రైజింగ్ టుగెదర్’ నినాదంతో నిర్వహించే ఈ సదస్సు ద్వారా దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని తెలిపారు.



చేయూత పింఛన్లతో నిరుపేదలకు ఆర్థిక భరోసా

- చేయూత పింఛన్లతో నిరుపేదలకు ఆర్థిక భరోసా
- మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరాలి: మంత్రి సీతక్క

ములుగు, నవంబర్ 17:

నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గోవిందరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత, నేత కార్మికులతో పాటు తలసేమియా బాధితులకు కూడా పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళ స్వయం సహాయక సంఘంలో చేరి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మహిళా సంఘాల ద్వారా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.గోవిందరావుపేట మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 487 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. మరో 10 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.



కాంగ్రెస్ హామీలకు మూడేళ్లు

- ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు.. అమలు శూన్యం: రవీంద్ర కుమార్

దేవరకొండ, నవంబర్ 17

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు.2023 నవంబర్ 17న ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ‘అభయహస్తం’ మేనిఫెస్టో ప్రకటించి, 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి మూడేళ్లు గడిచినా అనేక హామీలు నెరవేరలేదన్నారు.రైతులకు రుణమాఫీ, మహిళలకు రూ.2,500 సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుద్యోగులకు భృతి, రెండు లక్షల ఉద్యోగాలు వంటి హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి ఎందుకు అమలు చేయలేదో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్ర నేతలు ప్రజలకు వివరించాలని కోరారు. హామీలన్నీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాడుతుందని రవీంద్ర కుమార్ స్పష్టం చేశారు.

“ఇందిరమ్మ టవర్స్”కు విశేష స్పందన

నిజామాబాద్, నవంబర్ 17

నాగారం ఆర్‌జేకే కాలనీలో నిర్మించనున్న 480 ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్లకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.512 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఒక్కో ఫ్లాట్‌కు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని, లబ్ధిదారుడి వాటా తాత్కాలికంగా రూ.3.50 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. సొంత ఇల్లు లేదా ప్లాట్ లేని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలకు మించని వారు అర్హులని పేర్కొన్నారు.అర్హులు డిసెంబర్ 5లోగా మీ సేవా కేంద్రాలు లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

భారత్–ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ

మనీలా, నవంబర్ 17:

ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన 23వ భారత్-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. భారత్-ఆసియాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, సహకారానికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు. సముద్ర, సైబర్, అంతరిక్ష, అణుశక్తి, కీలక ఖనిజాలు, యువత, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని పెంచేందుకు పలు ప్రతిపాదనలు చేశారు. ఆసియాన్ దేశాల పర్యాటకులకు ఉచిత ఈవీసా సౌకర్యాన్ని కూడా ప్రతిపాదించారు.2027లో భారత్-ఆసియాన్ సంబంధాల 35 ఏళ్లు, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి 5 ఏళ్లు పూర్తవుతాయని ప్రధాని పేర్కొన్నారు.

కొపి (అలసంద)పంటలను పరిశీలించిన కోస్గి ఏడిఏ నూతన్ కుమార్

గుండుమాల్ మండలం, నవంబర్,17(సమయం న్యూస్)

గుండుమాల్ మండలంలోని భోగారం గ్రామంలో ఏడిఏ నూతన్ కుమార్ కొపి (అలసంద) పంటను క్షేత్రస్థాయిలోపరిశీలించారు. ఈ సందర్భంగా పంట ప్రస్తుతం పూత దశలో ఉన్నట్లు గుర్తించారు. రైతులకు వేపనూనె పిచికారీ చేయడం వల్ల ప్రారంభ దశలోనే పురుగుల ఉధృతిని తగ్గించి, పంటను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చని వివరించారు. తద్వారా పూత, కాయల అభివృద్ధికి మరియు గింజ నాణ్యతకు తోడ్పడుతుందని సూచించారు. క్షేత్ర పరిశీలనలో కొపి పంటలో పొగాకు లద్దె పురుగు (Spodoptera litura) ఉనికిని గుర్తించారు.ఈ పురుగు పంట ఆకులను తినడం ద్వారా తీవ్ర నష్టం కలిగిస్తుందని, ముఖ్యంగా పెద్ద లార్వాలు రాత్రి సమయంలో చురుకుగా ఉండి పంటకు నష్టం కలిగిస్తాయని రైతులకు వివరించారు. వీటి నివారణకు విషపు ఎర (Poison Bait) పద్ధతి గురించి అవగాహన కల్పించారు.విషపు ఎర తయారీకి కావలసిన పదార్థాలు (ఎకరానికి):

వరి తవుడు - 5 కిలోలు
బెల్లం - 500 గ్రాములు
నీరు - 3 లీటర్లు
కార్బరిల్ 50 WP - 500 గ్రాములు*

రైతులకు విషపు ఎర తయారీ విధానం మరియు దాని వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఇఓ కె. తిరుపతి మరియు రైతులు పాల్గొన్నారు.

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ

- **సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వండి**
- **ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

హైదరాబాద్, నవంబర్ 17:

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ జారీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయిని కోరారు. నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన భేటీ అయ్యారు. ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందించారు.ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన బ్యారేజీకి 6.94 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉంది. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం ఛత్తీస్‌గఢ్‌లో ముంపు పరిమితంగానే ఉంటుందని తేలింది. కరువు ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాల కోసం గోదావరి జలాలను వినియోగించేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని సీఎం తెలిపారు.



ధోనీకి CSK మెంటర్ బాధ్యతలు



CSK మెంటర్‌గా ధోనీ.. అధికారిక ప్రకటన చెన్నై సూపర్ కింగ్స్ (CSK) మెంటర్‌గా మహేంద్ర సింగ్ ధోనీకి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు CSK అధికారికంగా ప్రకటించింది.జట్టు సాధించిన ఎన్నో విజయాల్లో ధోనీ కీలక పాత్ర పోషించారని, కష్టకాలాల్లోనూ జట్టుకు అండగా నిలిచారని CSK పేర్కొంది. జట్టు ప్రారంభమైనప్పటి నుంచి ధోనీ ప్రయాణంలో కీలక భాగంగా ఉన్నారని తెలిపింది.ఇకపై యువ ఆటగాళ్లకు ధోనీ మార్గదర్శకత్వం వహించనున్నారు. తన అపారమైన అనుభవాన్ని పంచుకుంటూ కొత్త తరం సూపర్ కింగ్స్ ఆటగాళ్లను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించనున్నారు.“ధోనీ ఎప్పటికీ CSK గుర్తింపులో భాగమే. చెన్నై ఆయనకు ఎప్పటికీ సొంత ఇల్లులాంటిదే” అని CSK పేర్కొంది.

సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ లేదు: కేటీఆర్

- **రూ.100 కోట్లతో భారత్ సమ్మిట్ నిర్వహించి సాధించిందేమిటని ప్రశ్న**
- **కరువు సమయంలో ప్రభుత్వ నిధుల దుబారా.. మూసీ సుందరీకరణపై అభ్యంతరం**
- **కొడంగల్‌కు రూ.9 వేల కోట్లు.. మేడిగడ్డ నీటిని వినియోగించడంలో ప్రభుత్వం విఫలం**

హైదరాబాద్, నవంబర్ 17:

తెలంగాణ ప్రజల ఉద్యమం ఉధృతం కావడంతోనే అనివార్య పరిస్థితుల్లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణపై ప్రేమ లేదని విమర్శించారు.కరువు పరిస్థితుల్లో ప్రజల అవసరాలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిధులను దుబారా చేస్తోందని ఆరోపించారు. రూ.100 కోట్లతో భారత్ సమ్మిట్ నిర్వహించి రాష్ట్రానికి సాధించిన ప్రయోజనం ఏమిటో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. సమ్మిట్ ద్వారా వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. కొడంగల్ నియోజకవర్గానికి సుమారు రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు కేటాయించడాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అవసరాలను ప్రభుత్వం సమానంగా పరిగణించాలని అన్నారు.
మేడిగడ్డ బ్యారేజీలో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో మూసీ సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు 10 టీఎంసీల నీరు అవసరమవుతుందని పేర్కొంటూ, కరువు వేళ ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు.

నిరుపేదల గూడు నా బాధ్యత.. అండగా ఉంటా

- **వైఎస్ఆర్ నగర్ భూములపై ఆర్టీఐ పత్రాలతో వాస్తవాలు... ఎమ్మెల్యే 'నాయిని రాజేందర్ రెడ్డి'**
- **వైఎస్ఆర్ నగర్ ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే**
- **ఒక గుడిసె వెనుక ఓ కుటుంబం ఉంది.. ఆ కుటుంబానికి నేనున్నా...'నాయిని'**



కాజీపేట, నవంబర్ 17 (సమయం న్యూస్) :

కాజీపేట వైఎస్ఆర్ నగర్ భూములు, కాజీపేట చౌరస్తాలోని భవన నిర్మాణంపై వస్తున్న రాజకీయ ఆరోపణలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారిక ఆధారాలతో దీటుగా సమాధానమిచ్చారు. ప్రతిపక్ష నాయకులు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా సేకరించిన పత్రాలు, రెవెన్యూ రికార్డులు, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన డాక్యుమెంట్లను మంగళవారం కాజీపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ఆర్ నగర్ గుడిసెవాసుల సమస్యపై గతంలోనే ఆర్టీఐ ద్వారా వివరాలు సేకరించానని, మరింత సమగ్ర సమాచారం కోసం మరోసారి దరఖాస్తు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, కుడా, మున్సిపల్ కార్పొరేషన్ శాఖల నుంచి సేకరించిన అధికారిక పత్రాల ఆధారంగానే వాస్తవాలను వెల్లడిస్తున్నానని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా తాను ఎప్పుడూ మాట్లాడబోనని పేర్కొన్నారు.వైఎస్ఆర్ నగర్ భూములకు సంబంధించి ఇరానీ కుటుంబానికి చెందిన భూములు అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలోకి రావడంతో అప్పట్లో కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. న్యాయస్థానంలో కేసు కొనసాగుతున్న సమయంలోనే 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, అప్పటి ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో ఆ భూములను నాలా కన్వర్షన్ చేసి కుటుంబ సభ్యుల పేర్లపై ఎలా నమోదు చేశారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. 2018 వరకు సీలింగ్ భూములుగా ఉన్న భూములు 2019లో రెవెన్యూ రికార్డుల్లో ఎలా మార్పులకు గురయ్యాయో పహాణీలు, ఇతర అధికారిక పత్రాలతో వివరించారు. ఈ వ్యవహారంలో గుడిసెవాసుల హక్కులపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారుఅదేవిధంగా కాజీపేట చౌరస్తాలో నిర్మించిన భవనానికి సంబంధించి 2017లో అప్పటి కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి హయాంలో రెసిడెన్షియల్ భూమిని కమర్షియల్ అవసరాలకు ఎలా మార్చారో ప్రశ్నించారు. భవన నిర్మాణ అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ మార్పులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) మంజూరు తదితర అంశాలకు సంబంధించిన పత్రాలను మీడియా ముందు ఉంచారు. గత పాలకుల హయాంలో వైఎస్ఆర్ నగర్ ప్రజలకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, ఇప్పుడు తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.వైఎస్ఆర్ నగర్‌లో నివసిస్తున్న పేద ప్రజలను ఎవరూ ఇబ్బందులకు గురిచేయకూడదని, ప్రభుత్వ శాఖల అధికారులు సైతం అనవసరంగా భయాందోళనలకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. అక్కడి పరిస్థితుల దృష్ట్యా 144 సెక్షన్ అమల్లో ఉందని, ప్రజల ప్రశాంతతకు భంగం కలగకుండా, బయటి వ్యక్తులు వచ్చి వివాదాలు సృష్టించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు.వైఎస్ఆర్ నగర్ ప్రజలకు తాను అండగా ఉంటానని, వారి హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటానని భరోసా ఇచ్చారు. హంటర్ రోడ్డులో శిల్పారామం లేదా ఇతర పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల ఏర్పాటుపై ఆలోచనలు జరుగుతున్న సమయంలో, తనకు సంబంధం లేని వివాదంలోకి లాగేందుకు మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అనుచరులు రాత్రికి రాత్రే విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఆరోపించారు. అనంతరం అదే విగ్రహాన్ని వారి అనుచరులే ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ఉన్నాయని, వాటిని కూడా మీడియాకు అందజేస్తానని తెలిపారు. మతపరమైన అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం తగదని హితవు పలికారు.కుడా భూముల వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని వరంగల్ బస్టాండ్, స్టేడియం అభివృద్ధి వంటి ప్రజాప్రయోజన కార్యక్రమాలకు వినియోగించాలనే ఉద్దేశంతోనే అధికారులతో చర్చించినట్లు ఎమ్మెల్యే వివరించారు. అయితే ఈ అంశాన్ని సైతం రాజకీయ విమర్శలకు వాడుకోవడం సరికాదన్నారు. భూముల వేలానికి సంబంధించి గతంలో జరిగిన ప్రచారానికి, వాస్తవ ప్రక్రియకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు.రాజకీయ విమర్శలకు తాను భయపడేది లేదని, వ్యక్తిగత ఆరోపణలతో అసలు అంశాలను పక్కదారి పట్టించలేరని నాయిని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ నగర్ భూములు, కాజీపేట చౌరస్తా భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారిక రికార్డులతో ప్రజల ముందుంచుతానని తెలిపారు. పేదల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, వైఎస్ఆర్ నగర్ ప్రజలకు అండగా నిలుస్తానని పునరుద్ఘాటించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ రాజులి, తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, అబూబకర్, గుంటి కుమార్, సీనియర్ నాయకులు అంకుష్, సమత రాజు, పల్లకొండ సతీష్, డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల అంజనేయులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ సేవల్లో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

- **పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి**
- **డ్రగ్స్ అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలి**
- **మామునూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ ఎన్.శ్వేత**



వరంగల్, నవంబర్ 17 (సమయం న్యూస్) :

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. మంగళవారం మామునూరు పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల తీరును సమీక్షించి పలు సూచనలు చేశారు.ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతోపాటు నాణ్యమైన దర్యాప్తుతో కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు.డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అనుమానితుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సీపీ ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ తనిఖీలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, పర్వతగిరి సీఐ ఆర్. సంతోష్ కుమార్, మామునూరు ఇన్‌స్పెక్టర్ ఈ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో కరువు నేపథ్యంలో గ్లోబల్ సమ్మిట్ వాయిదా

- **400 మందికి పైగా పౌరులు, పౌరసమాజ ప్రతినిధుల విజ్ఞప్తి**

హైదరాబాద్, నవంబర్ 17:

తెలంగాణ తీవ్ర ఎల్‌నినో ప్రభావం, కరువు, నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో డిసెంబర్‌లో నిర్వహించనున్న ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్’ను వాయిదా వేయాలని 400 మందికి పైగా పౌరులు, మాజీ ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, పౌరసమాజ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 365 మండలాలను తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు ప్రజల తాగునీరు, వ్యవసాయం, విద్యుత్, కరువు సహాయక చర్యలపై ఉండాలని వారు పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా తీవ్రంగా ప్రభావితమైందని, ఇలాంటి పరిస్థితుల్లో వేలాది మంది అంతర్జాతీయ ప్రతినిధులకు భారీ స్థాయిలో సౌకర్యాలు కల్పించడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న సమ్మిట్‌కు సుమారు 4,000 మంది ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో నీరు, విద్యుత్, ప్రజాధనం వినియోగంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఉన్నతాధికారులను లైజన్ అధికారులుగా నియమించడం వల్ల కరువు నివారణ, ప్రజల సమస్యల పరిష్కారంపై పరిపాలనా సామర్థ్యం తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రజల ప్రాథమిక జీవన హక్కును పరిరక్షించేందుకు ప్రభుత్వ వనరులుపరిపాలనా సామర్థ్యాన్నిపూర్తిగా కరువు నివారణ చర్యలకు కేటాయించాలని వారు ముఖ్యమంత్రిని కోరారు.

చీకటిని తరిమి.. చూపుల వెలుగులు నింపి.!

- **పేదల కళ్లల్లో కొత్త వెలుగులు.. జనతా ట్రస్ట్ మానవీయ సేవ**
- **1625 మందికి కంటి పరీక్షలు.. 52 మందికి ఉచిత శస్త్రచికిత్సలు**
- **పేదల కళ్లల్లో వెలుగులు నింపడమే లక్ష్యం... డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**



నెక్కొండ, నవంబర్ 17 (సమయం న్యూస్) :

పేదలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే సంకల్పంతో జనతా ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జనతా ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నెక్కొండలోని శ్రీ వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన ఆరో విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 1,625 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరంలో కంటి శస్త్రచికిత్సలు అవసరమైన 52 మందిని గుర్తించి హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. కంటి అద్దాలు అవసరమైన పలువురికి ఉచితంగా అద్దాలు అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేదలకు ఈ శిబిరం ఎంతో ఉపశమనం కలిగించింది.ఈ సందర్భంగా జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ‘నేత్రం ప్రియాణాం నయనం ప్రధానం’ అన్నట్లుగా అన్ని ఇంద్రియాల్లో కంటికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. నర్సంపేట నియోజకవర్గంలో ఎవరికీ కంటి సమస్యలతో ఇబ్బందులు కలగకుండా చూడటమే తన లక్ష్యమన్నారు. పేదలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించడమే జనతా ట్రస్ట్ ధ్యేయమని, ఇటువంటి శిబిరాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.
శిబిరం నిర్వహణకు వాసవి కల్యాణ మండపాన్ని ఉచితంగా అందించిన నెక్కొండ ఆర్యవైశ్య సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని గ్రామాలకు వైద్య సేవలను విస్తరిస్తామని, డబ్బులేక ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదన్నదే తమ సంకల్పమని పేర్కొన్నారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు.వైద్యుల సూచనలు స్వీకరించారు. కంటి అద్దాలు పొందిన వృద్ధుల ముఖాల్లో కనిపించిన ఆనందం శిబిరం సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో మారం రాము, దొడ్డ నాగేష్, తాటిపెల్లి శివకుమార్, దొడ్డ విజయ్, తాళ్లూరి నరసింహులు, కొనిశెట్టి భిక్షపతి, నాయిని అశోక్, దామచర్ల రామారావు, అంబాల రాంగోపాల్, రాంపల్లి రాజగోపాల్, శ్రీరంగం సాగర్, అంబాల సుధీర్, పసుల అశోక్, సింగారపు సురేష్, సింగారం శ్రీరాములు, నీలం ఏలేందర్, లొడియా శ్రీనివాస్, జమ్ముల సుధాకర్, మల్లం మల్లేష్, కుడికాల సుధీర్, పోయాడా అనిల్, జయప్రకాష్, శ్రీనివాస్ గౌడ్ శెట్టి, సూత్రం శీను, బల్లికొండ పవన్, కుడికాల శ్రీధర్ తదితరులతో పాటు జనతా ట్రస్ట్ సభ్యులు, శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం పాల్గొన్నారు.

చేనేత విశిష్టతను తెలుసుకున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు

రామన్నపేట నవంబర్ 17 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో పుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో రామన్నపేట లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. చేనేత వస్త్రాలు చేనేత ఉత్పత్తులపై అవగాహన కల్పించేందుకు హైస్కూల్ విద్యార్థులను మంగళవారం రామన్నపేట పద్మశాలి కాలనీలోని పలు చేనేత కుటుంబాలలో నిర్వహించే పనులను సందర్శించే విధంగా ఫీల్డ్ వర్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు నేరుగా చేనేత కార్మికుల వద్దకు వెళ్లి నోరు తయారీ, మగ్గం నడిచే విధానం, చేనేత చీరలు దోవతులు ఇతర ఉత్పత్తుల తయారీ విధానం గురించి స్వయంగా చూసి తెలుసుకున్నారు. పలువురు నేత కార్మికులు విద్యార్థులకు మగ్గం పని తీరు వివరిస్తూ చేనేత వస్త్రాల ప్రత్యేకతను వివరించారు. యంత్రాలతో తయారయ్యే వస్త్రాలకు చేతితో నేసిన వస్త్రాలకు నా తేడాను విద్యార్థులు వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి. సురేష్, ఉపాధ్యాయులు ఎండి. అలీముద్దీన్, కే లావణ్య తదితరులు ఉన్నారు.

లక్నో గూటికి సామ్ కర్రన్ ఢిల్లీ జట్టులో భారీ ప్రక్షాళన!


- ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు కీలక మార్పులు
- రూ.2.4 కోట్లకు లక్నోకు సామ్ కర్రన్ బదిలీ
- రాజస్థాన్ రాయల్స్‌కు షమీ, ఎం.సిద్ధార్థ్
- నితీశ్ రాణా, నిస్సాంక, డకెట్‌లకు ఢిల్లీ గుడ్‌బై
- రూ.29 కోట్లతో మినీ వేలానికి ఢిల్లీ సిద్ధమవుతున్నట్లు సమాచారం



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు అన్ని ఫ్రాంచైజీలు తమ జట్లను సమూలంగా ప్రక్షాళన చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఆటగాళ్ల రిటెన్షన్ గడువు ముగియడంతో ట్రేడింగ్ విండోలో పలు కీలక ఒప్పందాలు, సంచలన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య ఆసక్తికరమైన ట్రేడ్ జరిగింది. రాజస్థాన్ స్టార్ ఆల్‌రౌండర్ సామ్ కర్రన్‌ను తన పాత ధర రూ. 2.4 కోట్లకు లక్నో సూపర్ జెయింట్స్ సొంతం చేసుకుంది. ఇదే క్రమంలో లక్నో నుంచి సీనియర్ పేసర్ మహ్మద్ షమీ (రూ. 8 కోట్లు), ఎడమచేతి వాటం స్పిన్నర్ ఎం. సిద్ధార్థ్ (రూ. 75 లక్షలు) రాజస్థాన్ రాయల్స్ గూటికి చేరారు. లక్నోకు కొత్త బలం.. కెప్టెన్సీ ఆప్షన్‌గా సామ్ కర్రన్:ఐపీఎల్ కెరీర్‌లో ఇప్పటివరకు 59 వికెట్లు పడగొట్టడంతో పాటు 997 పరుగులు సాధించిన సామ్ కర్రన్, 2022 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్లిపోవడంతో, కర్రన్ రాక లక్నో మిడిల్ ఆర్డర్‌కు బలాన్నివ్వడమే కాకుండా కెప్టెన్సీ ఆప్షన్‌గానూ ఉపయోగపడనుంది. గత సీజన్‌లో గాయం కారణంగా దూరమైన కర్రన్, 2027 సీజన్‌లో లక్నో తరఫున బ్యాట్, బంతితో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు.

ఢిల్లీ క్యాపిటల్స్ ప్రక్షాళన.. రూ. 29 కోట్ల పర్స్‌తో వేలంలోకి:

మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తమ ఆటగాళ్ల జాబితాలో భారీ మార్పులు చేసింది. గత సీజన్‌లో రాజస్థాన్ నుంచి రూ. 4.2 కోట్లకు ట్రేడింగ్ ద్వారా వచ్చిన నితీశ్ రాణా 9 ఇన్నింగ్స్‌లలో కేవలం 225 పరుగులే చేసి నిరాశపరచడంతో అతడిని వదులుకుంది. అలాగే ఓపెనర్‌గా 10 ఇన్నింగ్స్‌లలో 278 పరుగులు చేసిన పాతుమ్ నిస్సాంకతో పాటు, టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇస్తూ గత సీజన్‌కు దూరమైన బెన్ డకెట్‌ను కూడా ఢిల్లీ రిలీజ్ చేసింది. వీరితో పాటు ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్, అభిషేక్ పోరెల్, కరుణ్ నాయర్ వంటి మరికొందరు ఆటగాళ్లను కూడా ఢిల్లీ వదులుకోవడంతో, రాబోయే మినీ వేలంలో ఆ జట్టు రూ. 29 కోట్ల భారీ పర్స్‌తో బరిలోకి దిగనుంది.ట్రేడింగ్ విండోలో మరిన్ని సంచలనాలు:ఇతర జట్ల విషయానికి వస్తే.. ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు, పంజాబ్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు చెరో రూ. 18 కోట్ల భారీ ధరతో ట్రేడ్ అవ్వడం ఈ సీజన్‌లో అతిపెద్ద సంచలనంగా మారింది. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ ఆటగాడిగా ఐపీఎల్‌కు వీడ్కోలు పలికి జట్టు మెంటార్‌గా కొత్త బాధ్యతలు చేపట్టడం క్రీడా వర్గాల్లో విశేషంగా నిలిచింది.



మను భాకర్‌కు అరుదైన గౌరవం

ఐఎస్ఎస్ఎఫ్ అథ్లెట్ల కమిటీకి ఎన్నికైన భారత షూటర్

న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): భారత స్టార్ మహిళా షూటర్ మను భాకర్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) అథ్లెట్ల కమిటీకి ఆమె ఎన్నికయ్యారు. కమిటీలోని రెండు పదవుల కోసం మొత్తం పది మంది క్రీడాకారులు పోటీపడగా, మను భాకర్ ఒక స్థానాన్ని దక్కించుకున్నారు. 2026 నుంచి 2030 వరకు పిస్టల్ విభాగంలో క్రీడాకారుల ప్రతినిధిగా ఆమె బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ విషయాన్ని భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) వెల్లడించింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడల నిర్వహణ, క్రీడాకారుల సమస్యలు, సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో అథ్లెట్ల అభిప్రాయాలను వినిపించే అవకాశం మను భాకర్‌కు లభించనుంది. భారత షూటింగ్ క్రీడారంగానికి ఇది మరో విశేష గుర్తింపుగా నిలిచింది.

కెరీర్‌లో విరాట్ కోహ్లీ చేసిన అతిపెద్ద తప్పు అదే

- పదేళ్ల తర్వాత పశ్చాత్తాపపడతాడు: కపిల్ దేవ్
- టెస్టు క్రికెట్‌కు కోహ్లీ వీడ్కోలు పలకడంపై భారత దిగ్గజ కెప్టెన్ కీలక వ్యాఖ్యలు
- 25 ఏళ్ల యువ క్రికెటర్‌కు సైతం సవాలు విసరగలిగే అద్భుత ఫిట్‌నెస్ ఉండి కూడా రిటైర్ కావడం సరికాదని అభిప్రాయం
- కోపంతో తప్పుకోవడం కంటే మొహిందర్ అమర్‌నాథ్‌లా పోరాడి తిరిగి జట్టులోకి రావాల్సిందని సూచన




న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంపై భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకోవాలని కోహ్లీ తీసుకున్న నిర్ణయం అతడి కెరీర్‌లో చేసిన అతిపెద్ద తప్పు అని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డారు. ఎంతో అద్భుతమైన ఫిట్‌నెస్ ఉన్న విరాట్‌కు టెస్టుల్లో ఇంకా రాణించగల సత్తా పుష్కలంగా ఉందని, తొందరపడి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల భవిష్యత్తులో కోహ్లీ తప్పకుండా పశ్చాత్తాపం వ్యక్తం చేస్తాడని ఆయన పేర్కొన్నారు.

కోపంతో రిటైర్ అవ్వడం సరికాదు - కపిల్ దేవ్

ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కపిల్ దేవ్ మాట్లాడుతూ.. "కోహ్లీ టెస్టుల నుంచి రిటైర్ అయి అతిపెద్ద తప్పు చేశాడని నేను అనుకుంటున్నా. ఈ నిర్ణయం తీసుకున్నందుకు పదేళ్ల తర్వాత అతడు కచ్చితంగా పశ్చాత్తాపపడతాడు. అసలు ఆ నిర్ణయం తీసుకోకుండా ఉండాల్సింది. అతడికి ఉన్నంత అద్భుతమైన ఫిట్‌నెస్ మరే ఆటగాడికి లేదు. ఫిట్‌నెస్ విషయంలో 25 ఏళ్ల యువ క్రికెటర్‌కు సైతం కోహ్లీ సవాలు విసరగలడు. కోపంతో రిటైర్ అవ్వడం ఎప్పటికీ సరికాదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మాజీ క్రికెటర్ మొహిందర్ అమర్‌నాథ్‌లా వ్యవహరించాలి. అమర్‌నాథ్‌ను ఎన్నోసార్లు జట్టు నుంచి తొలగించారు. అయినా ఆయన కుంగిపోకుండా తిరిగి జట్టులో చోటు సంపాదించుకుని, తన విషయంలో ఇతరుల అంచనాలు తప్పు అని నిరూపించారు" అని కపిల్ దేవ్ గుర్తుచేశారు.

వన్డేల్లో కొనసాగుతున్న కోహ్లీ ప్రస్థానం

2024లో టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ, ఆ తర్వాత 2025 మే నెలలో టెస్టు క్రికెట్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. 123 టెస్టులు ఆడిన కోహ్లీ 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించి సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకున్నాడు. ప్రస్తుతం కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న కోహ్లీ.. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో 74 పరుగులతో రాణించినప్పటికీ, ఆ తర్వాతి మ్యాచ్‌లలో నిరాశపరిచాడు. అయితే, ఓవరాల్‌గా ఈ ఏడాది వన్డేల్లో 13 ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ 53.17 సగటుతో 638 పరుగులు చేసి నిలకడగా రాణిస్తున్నాడు.



ఐపీఎల్‌కు ధోనీ గుడ్‌బై..

ఇక సీఎస్కే మెంటార్‌గా కొత్త ఇన్నింగ్స్!


చెన్నై, నవంబర్ 17 (సమయం న్యూస్): భారత క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్ కెరీర్‌కు వీడ్కోలు పలికినట్లు వార్తలు వెలువడ్డాయి. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) జట్టుకు ఇకపై మెంటార్‌గా వ్యవహరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ధోనీ రిటైర్మెంట్, మెంటార్ బాధ్యతలపై సీఎస్కే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటన చేసినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ ఐపీఎల్‌లోనూ ఆటగాడిగా తన ప్రయాణాన్ని ముగిస్తే, సీఎస్కే అభిమానులకు ఇది భావోద్వేగ ఘట్టంగా నిలవనుంది. ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా ధోనీ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ 2010, 2011, 2018, 2021, 2023 సీజన్లలో ఐపీఎల్ విజేతగా నిలిచింది. సీఎస్కేపై నిషేధం ఉన్న 2016, 2017 సీజన్లలో రైజింగ్ పుణె సూపర్‌జెయింట్ తరఫున ఆడారు. 2025లో రుతురాజ్ గైక్వాడ్ గాయపడటంతో మరోసారి తాత్కాలికంగా జట్టు నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. ఐపీఎల్‌లో 278 మ్యాచ్‌లు ఆడి 5,439 పరుగులు సాధించిన ధోనీ వికెట్‌కీపర్‌గా 158 క్యాచ్‌లు, 47 స్టంపింగ్స్‌తోనూ తనదైన ముద్ర వేశారు.

సెలక్టర్లు ఎక్కడుంటే.. బంతిని అక్కడికే కొట్టాలి!



ధోనీ సినిమా డైలాగ్‌తో సూర్యకుమార్ సండడి

న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ మళ్లీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబై జట్టుకు నాయకత్వం వహిస్తున్న సూర్య వరుసగా రెండు మ్యాచ్‌ల్లో అర్ధశతకాలు బాది సత్తా చాటాడు. హైదరాబాద్‌పై కేవలం 21 బంతుల్లో 60 పరుగులు చేసిన అతడు గుజరాత్‌పై 29 బంతుల్లోనే 82 పరుగులతో చెలరేగాడు. ఫామ్ కోల్పోయి భారత జట్టుకు దూరమైన సూర్య తిరిగి జాతీయ జట్టులో చోటు సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నాడనే చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌తో మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ మీడియాతో మాట్లాడుతూ తన బ్యాటింగ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మహేంద్రసింగ్ ధోనీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ' చిత్రంలోని ఓ సంభాషణను గుర్తుచేశాడు. 'సెలక్టర్లు ఎక్కడ కూర్చుంటారో అక్కడికే బంతిని కొట్టాలి' అనే డైలాగ్‌ను ప్రస్తావిస్తూ తాను కూడా అదే తరహాలో ఆడానని చమత్కరించాడు. అయితే సెలక్టర్లకు సందేశం పంపడం తన ఉద్దేశం కాదని, పరుగులు సాధించి ముంబై జట్టును గెలిపించడంపైనే దృష్టి పెట్టానని స్పష్టం చేశాడు. కాగా, హైదరాబాద్‌తో మ్యాచ్‌ను బీసీసీఐ సెలక్టర్ శివసుందర్ దాస్ ప్రత్యక్షంగా వీక్షించారు. సాల్ట్‌లేక్‌లోని జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయ మైదానంలో సూర్య బాదిన ఓ భారీ సిక్సర్ మైదానం బయట పడటం విశేషం. టీ20 క్రికెట్ వినోదంతో కూడుకున్న ఆట అని, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడాలని సూర్య పేర్కొన్నాడు. సాధన సమయంలో ప్రయత్నించిన షాట్లనే మ్యాచ్‌లో ఆడుతున్నానని, తన కృషికి ఫలితం దక్కుతోందని సంతోషం వ్యక్తం చేశాడు. వరుస అర్ధశతకాలతో సూర్య తిరిగి ఫామ్ అందుకోవడం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.



సినీ పరిశ్రమలో భయంతో బతకాల్సి వస్తోంది!

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా సంచలన వ్యాఖ్యలు

ముంబై, నవంబర్ 17 (సమయం న్యూస్): సినీ పరిశ్రమలో హీరోయిన్లు భయంతో బతకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా ఆవేదన వ్యక్తం చేశారు. హీరోలు ఏం చేసినా అభిమానులు పెద్దగా పట్టించుకోరని, కొన్నిసార్లు వారి తప్పులను కూడా సమర్థిస్తారని అన్నారు. అదే హీరోయిన్ల విషయంలో మాత్రం చిన్న పొరపాటును సైతం భూతద్దంలో చూపిస్తూ సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఊర్వశి సినీ పరిశ్రమలో నటీమణులు ఎదుర్కొంటున్న వివక్ష, సామాజిక మాధ్యమాల వేధింపులపై స్పందించారు. హీరోయిన్లు ఎలాంటి తప్పు చేయకపోయినా ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని, చిన్న విషయాలను కూడా పెద్ద వివాదాలుగా మారుస్తున్నారని ఊర్వశి పేర్కొన్నారు. ఇలాంటి ప్రతికూల ప్రచారం వల్ల ఎంతోమంది నటీమణులు మానసిక ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. హీరోలతో పోలిస్తే హీరోయిన్లే విమర్శలకు ఎక్కువగా భయపడాల్సి వస్తోందన్నారు. ప్రేక్షకులను అలరించేందుకు నటీమణులు ఎంతో కష్టపడతారని, వారి కృషిని ప్రశంసించకపోయినా అనవసర విమర్శలతో మనసులను గాయపరచవద్దని కోరారు. సినీ పరిశ్రమతోపాటు సమాజంలోనూ మహిళా నటుల పట్ల ఆలోచనా విధానం మారాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఊర్వశి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



'బుట్టబొమ్మ' రికార్డు బద్దలు..
ఫోక్ సాంగ్ సెన్సేషన్!

అల్లు అర్జున్ సూపర్‌హిట్ పాటను అధిగమించిన 'రాను బొంబాయికి రాను'



హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): తెలుగు సంగీత ప్రపంచంలో ఓ జానపద గీతం సరికొత్త సంచలనం సృష్టించింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'అల వైకుంఠపురములో' చిత్రంలోని సూపర్‌హిట్ పాట 'బుట్టబొమ్మ' యూట్యూబ్ వీక్షణల రికార్డును 'రాను బొంబాయికి రాను' జానపద గీతం అధిగమించినట్లు సమాచారం. త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అల వైకుంఠపురములో' చిత్రంలోని 'బుట్టబొమ్మ' పాట 95.5 కోట్లకు పైగా వీక్షణలు సాధించగా, తాజాగా 'రాను బొంబాయికి రాను' పాట 95.7 కోట్లకు పైగా వీక్షణలతో దాన్ని దాటేసింది. రాము రాథోడ్, లిఖిత ఆలపించిన 'రాను బొంబాయికి రాను' పాట 2025 జనవరి 23న విడుదలైంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ తక్కువ సమయంలోనే కోట్లాది వీక్షణలు సొంతం చేసుకుంది. భారీ బడ్జెట్ చిత్రంలోని స్టార్ హీరో పాటను ఓ జానపద గీతం అధిగమించడం సంగీత ప్రియుల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. మరోవైపు దక్షిణాది సినిమా పాటల్లో ధనుష్ నటించిన 'మారి 2' చిత్రంలోని 'రౌడీ బేబీ' సుమారు 177 కోట్ల వీక్షణలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నట్లు సమాచారం. జానపద సంగీతానికి పెరుగుతున్న ఆదరణకు 'రాను బొంబాయికి రాను' విజయమే నిదర్శనంగా నిలుస్తోంది.

స్టెప్పులతో అదరగొట్టిన సాయిపల్లవి, శ్రీలీల

ధనుష్ హీరోగా నటించిన 'కా.వీ' సినిమా ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. మమ్ముట్టి, సాయిపల్లవి, శ్రీలీల, రేణు దేశాయ్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ వేడుకలో సాయిపల్లవి, శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇద్దరూ కలిసి వేదికపై డాన్స్ చేయడంతో అభిమానులు కేరింతలు కొట్టారు. వారి స్టెప్పులకు హీరో ధనుష్ చప్పట్లు కొడుతూ అభినందించారు. ప్రస్తుతం వీరిద్దరి డాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.







పూజా హెగ్డే గ్రాండ్ రీ-ఎంట్రీ!

నాలుగేళ్ల విరామం తర్వాత తెలుగు సినిమాలపై ఫోకస్



ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన వరుస సినిమాలతో టాప్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే.. కొంతకాలంగా తెలుగు తెరకు దూరంగా ఉంటున్నారు. 2022లో 'ఆచార్య' తర్వాత పూర్తిస్థాయి తెలుగు సినిమాలో కనిపించలేదు. బాలీవుడ్, కోలీవుడ్ చిత్రాలతో బిజీగా గడిపిన ఈ బుట్టబొమ్మ ఇప్పుడు మళ్లీ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. దుల్కర్ సల్మాన్ హీరోగా రవి నేలకుదిటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శ్రీ శ్రీ' సినిమాతో పూజా రీఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. మరోవైపు అల్లు అర్జున్-లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమాలోనూ ఆమె పేరు వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వరుసగా భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటున్నారనే ప్రచారంతో పూజా సెకండ్ ఇన్నింగ్స్‌పై ఆసక్తి పెరుగుతోంది. మరి ఈ సినిమాలతో బుట్టబొమ్మ మళ్లీ టాలీవుడ్‌లో తన పూర్వ వైభవాన్ని అందుకుంటుందేమో చూడాలి.

క్యాస్టింగ్ కౌచ్ నిన్నా ఉంది.. నేడూ ఉంది.. రేపూ ఉంటుంది!

సినీ పరిశ్రమలోని వేధింపులపై రమ్యకృష్ణ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ వ్యవహారంపై సీనియర్ నటి రమ్యకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. క్యాస్టింగ్ కౌచ్ గతంలో జరిగిందని, ప్రస్తుతం జరుగుతోందని, భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్న రమ్యకృష్ణ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ అంశంపై స్పందించారు. క్యాస్టింగ్ కౌచ్ అసలు లేదని చెప్పడం వాస్తవాలను కప్పిపుచ్చడమేనని అభిప్రాయపడ్డారు. కాలాన్ని బట్టి వేధింపులు జరిగే విధానం మారుతుందని, బలవంతంగా జరుగుతున్నాయా, పరస్పర అంగీకారంతో జరుగుతున్నాయా అనే అంశాలను వేర్వేరుగా చూడాల్సి ఉంటుందని వివరించారు. అయితే క్యాస్టింగ్ కౌచ్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా సినీ పరిశ్రమనే ఎందుకు వేలెత్తి చూపుతున్నారని రమ్యకృష్ణ ప్రశ్నించారు. సినిమా రంగం అందరి దృష్టిని ఆకర్షించే రంగం కావడంతో ఇక్కడ జరిగే సంఘటనలపైనే ఎక్కువ చర్చ జరుగుతోందన్నారు. వాస్తవానికి లైంగిక వేధింపులు కేవలం సినీ పరిశ్రమకే పరిమితం కాలేదని, ఇతర రంగాల్లోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. మహిళలతోపాటు పురుషులు కూడా వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యను ఒక్క రంగానికి మాత్రమే ఆపాదించడం సరికాదని, అన్ని రంగాల్లోనూ వేధింపులను అరికట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రమ్యకృష్ణ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

అనురాగపు స్పర్శతో చిన్నారులకు 'ఆరోగ్య' భరోసా

- జాలి కాదు.. ప్రేమాభిమానాలు పంచుదాం...డాక్టర్ అనితా రెడ్డి
- దివ్యాంగ చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం

హనుమకొండ, నవంబర్ 17 (సమయం న్యూస్)



బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, వాచ్ చిల్డ్రన్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల, బధిరుల ఆశ్రమంలో చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. చలికాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ఆదరణకు దూరమైన పిల్లలకు సమాజం మరింత ప్రేమ, ఆప్యాయతలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మానసిక దివ్యాంగులైన చిన్నారులకు కూడా ఇతర పిల్లలతో సమానమైన హక్కులు ఉంటాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దివ్యాంగుల పట్ల జాలి చూపడం కంటే ప్రేమాభిమానాలు, ఆదరణ, చేయూత అందించాలని పేర్కొన్నారు. వారి సేవ విశ్వమానవ సేవతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ, రాసు సుధారెడ్డి, స్పందన సంస్థ నిర్వాహకురాలు సుచరిత, ఉపాధ్యాయులు వసుధ, హరిత పాల్గొన్నారు

'పెద్ది సుదర్శన్ రెడ్డి' సేవా వారసత్వానికి కొనసాగింపు

- 25 ఏళ్లుగా ఆగని అన్నదాన యజ్ఞం.. ఈసారి బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో
- నర్సంపేటలో డిసెంబరు 9న పంబా ఆరట్టు.. మహా అన్నదాన కార్యక్రమం
- కేటీఆర్ ఆదేశాలతో ఏర్పాట్లు.. వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ – 'పెద్ది స్వప్న' సుదర్శన్ రెడ్డి

నర్సంపేట, నవంబరు 17 (సమయం న్యూస్) :



అయ్యప్ప భక్తులకు అన్నదానం చేయడం పవిత్ర సేవగా భావించి దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రారంభించిన సంప్రదాయాన్ని కొనసాగిస్తామని వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు డిసెంబరు 9న నర్సంపేటలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో పంబా ఆరాట్ మహా అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ మేరకు మంగళవారం ఆలయ కమిటీ బాధ్యులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.భక్తులకు అవసరమైన సౌకర్యాలు, అన్నదాన నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై చర్చించారు.ఈ సందర్భంగా స్వప్న సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి గత 25 ఏళ్లుగా పంబా ఆరాట్ సందర్భంగా మహా అన్నదాతగా వ్యవహరిస్తూ వేలాది మంది అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం అందించారని గుర్తుచేశారు. ఆయన ప్రారంభించిన సేవా సంప్రదాయాన్ని తమ కుటుంబం కొనసాగిస్తోందని తెలిపారు.ఈ ఏడాది కార్యక్రమాన్ని మరింత వైభవంగా నిర్వహించాలనే ఉద్దేశంతో కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించినట్లు పేర్కొన్నారు. డిసెంబరు 9న జరిగే అన్నదానానికి నర్సంపేటతో పాటు పరిసర మండలాల నుంచి వేలాది మంది అయ్యప్ప భక్తులు, మాలధారులు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు, అయ్యప్ప భక్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్వప్న సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో అయ్యప్ప ఆలయ కమిటీ బాధ్యులు, బీఆర్ఎస్ నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

యూఐడీఏఐ ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

- ప్రజలకు ఆధార్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యం
- ఆధార్ సేవా కేంద్రంలోని సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 17:-



ప్రజలకు ఆధార్ సేవలను మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో ఏర్పాటు చేసిన యూఐడీఏఐ (UIDAI) ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ కార్డు నేటి రోజుల్లో ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమైన గుర్తింపు పత్రంగా మారిందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడం, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సేవలను వినియోగించుకోవడం వంటి అనేక అవసరాలకు ఆధార్ కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఆధార్‌కు సంబంధించిన సేవలు ఒకే చోట సులభంగా అందించాలనే ఉద్దేశంతో ఆధార్ సేవా కేంద్రాన్ని(ASK) ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆధార్ నమోదు, ఆధార్ వివరాల్లో మార్పులు, చిరునామా, మొబైల్ నంబర్, ఇతర వివరాల నవీకరణ వంటి సేవలను నిబంధనల ప్రకారం ప్రజలు పొందవచ్చని తెలిపారు. ప్రత్యేకించి వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు ఆధార్ సేవల కోసం ఇబ్బందులు పడకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్రానికి వచ్చే ప్రజలకు మర్యాదపూర్వకంగా సేవలందిస్తూ, నిర్ణీత సమయంలో వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ఆధార్ సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ చేయూత పింఛన్లు..

- మహిళా సాధికారతకు పెద్దపీట
- భూపాలపల్లికి రైల్వే లైన్, బైపాస్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు
- నేత కార్మికుల పింఛన్లపై విచారణకు ఆదేశం – ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వరంగల్/భూపాలపల్లి, నవంబర్ 17 (సమయం న్యూస్)



పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ ఇందిరమ్మ ఇళ్లతో పాటు పలు సంక్షేమ పథకాలను మహిళల పేరుతోనే అమలు చేస్తున్నామని తెలిపారు.భూపాలపల్లిలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పింఛన్ల మంజూరు పత్రాలతో పాటు కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా 4.5 లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేసిందన్నారు. ఈ ఏడాది పింఛన్ల కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, గృహజ్యోతి వంటి పథకాలతో పేదలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. భూపాలపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక కృషి చేస్తున్నారని ప్రశంసించారు. స్థానిక ఆసుపత్రిలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. భూపాలపల్లికి రైల్వే లైన్ ఏర్పాటుకు అలైన్‌మెంట్, ప్రణాళిక రూపకల్పన కొనసాగుతోందని, బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ ముందుకు సాగుతోందని వెల్లడించారు. దేవాలయాలు, చారిత్రక కట్టడాల అభివృద్ధికి ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల హక్కులను కాపాడుకోవాలని సూచించారు. నేత కార్మికుల పింఛన్లపై విచారణ..భూపాలపల్లి మండలంలో నేత కార్మికులకు కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు కాకపోవడంపై ఎంపీ స్పందించారు. సంబంధిత రికార్డుల్లో సున్నా సంఖ్య ఉండటంపై అధికారులు విచారణ చేపట్టి కారణాలు గుర్తించాలని ఆదేశించారు. అర్హులైన నేత కార్మికులు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని, సందేహాలుంటే కలెక్టరేట్‌లో అధికారులను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి 70వ ఎస్ జి ఎఫ్ బాల బాలికల కబడ్డీ పోటీలు

వలిగొండ నవంబర్ 17 (సమయం న్యూస్)



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని శ్రీ వేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తుమ్మల రామిరెడ్డి మరియు వసంత జ్ఞాపకార్థం యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి 70వ ఎస్‌జీఎఫ్ పాఠశాలల బాల బాలికల కబడ్డీ పోటీలు 2026-27 ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులచే నిర్వహించిన కవాతు (పరేడ్)ను గౌరవంగా స్వీకరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జీవితంలోని స్ఫూర్తిదాయకమైన సంఘటనను వివరించి, క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో ముందుకు సాగాలని సూచించారు.అనంతరం ఆయన స్వయంగా కబడ్డీ మైదానంలోకి దిగి ఆటలో పాల్గొని, తనదైన చాకచక్యమైన ఆటతీరుతో విద్యార్థులను ఉత్సాహపరిచారు.క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ఆడుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించారు.ఈ కార్యక్రమానికి తహసీల్దార్ దశరథ నాయక్, మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్, వలిగొండ సర్పంచ్ వెంకటపాపిరెడ్డి, డీవైఎస్ఓ ధనుంజయ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.కె. రసూల్, టీఎస్ పీటీఏ ప్రతినిధి అలకుంట్ల శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.ఈ పోటీల నిర్వహణ కార్యదర్శిగా జి. స్వామి రాజు వ్యవహరించారు. బాల బాలికల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడానికి ఇలాంటి జిల్లా స్థాయి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

మల్కాజిగిరి రైల్వే స్టేషన్ మాస్టర్ రోహిత్ కుమార్ బదిలీ

మల్కాజిగిరి, నవంబర్ 17

మల్కాజిగిరి రైల్వే స్టేషన్ మాస్టర్‌గా నాలుగున్నరేళ్ల పాటు సేవలందించిన రోహిత్ కుమార్ కాచిగూడ రైల్వే స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని సిగ్నల్ అండ్ టెలికాం, ఆపరేటింగ్ విభాగాల సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.పూలమాలలు, శాలువాలతో రోహిత్ కుమార్‌ను సత్కరించి, ఆయన అందించిన సేవలను అభినందించారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ శంసుల్ హాక్, నూర్‌తో పాటు రైల్వే ఉద్యోగులు, యూనియన్ నాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



చిత్తడి నేలల సర్వేను వేగవంతం చేయాలి

ములుగు, నవంబర్ 17:

జిల్లాలో గుర్తించిన చిత్తడి నేలలకు సంబంధించిన చెరువుల సర్వే, హద్దుల నిర్ధారణ ప్రక్రియను వేగవంతం చేసి వారం రోజుల్లో సాధ్యమైనన్ని సర్వేలు పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా చెరువుల పరిధిని గుర్తించి సరిహద్దు గుర్తులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎఫ్ఆర్ఎల్, గరిష్ఠ వరద నీటిమట్టాన్ని పరిగణనలోకి తీసుకుని హద్దులు నిర్ధారించాలన్నారు. రెవెన్యూ, అటవీ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో సంయుక్త సర్వే నిర్వహించాలని, ఈఈలు, డీఈలు, జేఈలు రెవెన్యూ సర్వేయర్లతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, డీఐఓ అప్పలనాయుడు, ఈఈ నారాయణతో పాటు వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



కరీంనగర్/జగిత్యాల: కొండగట్టు చందనోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రెవెన్యూ-ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ ఎం. హనుమంతరావు హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో నవంబర్ 15 నుంచి 20 వరకు 60 ఏళ్లకు ఒకసారి జరిగే అరుదైన చందనోత్సవం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలకు గవర్నర్‌ను వారు ఆహ్వానించారు.ఈ సందర్భంగా కొండగట్టు క్షేత్ర పురాణం, ఆలయ చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక విశిష్టత, పవిత్ర స్థల ప్రాశస్త్యాన్ని గవర్నర్‌కు వివరించారు.



ఖేలో ఇండియా నిర్వహణకు తెలంగాణ సన్నద్ధం

హైదరాబాద్, నవంబర్ 17:

తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026ను దేశంలోనే అత్యుత్తమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఖేలో ఇండియా నిర్వహణకు ప్రభుత్వం రూ.203.36 కోట్లు కేటాయించిందని, ఈ నిధులతో అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ 15-20 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్టేడియాలు, గ్రౌండ్లు, ట్రాక్‌లను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 7-8 వేల మంది క్రీడాకారులు, కోచ్‌లు, సిబ్బంది హాజరుకానున్న నేపథ్యంలో అత్యుత్తమ ఆతిథ్యం కల్పిస్తామని తెలిపారు. ప్రముఖ క్రీడాకారులను భాగస్వామ్యం చేసి, ప్రతి క్రీడా వేదికను పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించే ఆలోచన ఉందన్నారు.గ్రామీణ, గురుకుల విద్యార్థులను క్రీడా వేదికలకు తీసుకువచ్చి వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తామని చెప్పారు. ఖేలో ఇండియా విజయవంతం ద్వారా భవిష్యత్‌లో క్రీడా రంగానికి రూ.1,500-2,000 కోట్ల వరకు నిధులు సాధించే దిశగా కృషి చేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.



విభిన్న పంటల సాగుతో మెరుగైన ఆదాయం

ముస్తాబాద్, నవంబర్ 17:



వరి సాగుకు బదులుగా కూరగాయల సాగు చేపట్టి రైతు చింతలకుల చంద్రం మెరుగైన ఆదాయం పొందుతున్నారని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు.బందనకల్ గ్రామంలో మూడు ఎకరాల్లో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా దోసకాయ, కాకరకాయ, బీరకాయ, టమాట, పచ్చిమిర్చి, వేరుశెనగ తదితర పంటలను సాగు చేస్తున్న రైతు పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు. పంటల దిగుబడి, విక్రయాలు, ఆదాయం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ కూరగాయల సాగుతో ఏడాదికి రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తోందని, ముస్తాబాద్, సిరిసిల్ల మార్కెట్లలో ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు రైతు తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఉద్యాన, వ్యవసాయ శాఖల సూచనలతో సాగు చేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, వ్యవసాయ శాఖ అధికారి ప్రదీప్, తహసీల్దార్ ఫారూఖ్ పాల్గొన్నారు.

ఈఎంఆర్ఎస్ గాంధారి విద్యార్థుల ఘన విజయాలు

- **కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను కలిసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు**

కామారెడ్డి, నవంబర్ 17:

ఈఎంఆర్ఎస్ గాంధారి పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. విద్యార్థి కె. నవీన్ నీట్ 2026లో అర్హత సాధించి ప్రభుత్వ వైద్య కళాశాల, సిద్ధిపేటలో ప్రవేశం పొందగా, ఎల్. సంతోష్ రాష్ట్రస్థాయిలో ఈఎంఆర్ఎస్ సైన్స్ విభాగంలో టాపర్‌గా నిలిచారు. వీరిద్దరికీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము‌ను కలిసే అవకాశం లభించింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విద్యార్థుల విజయాలను కలెక్టర్ అభినందిస్తూ, వారి ప్రతిభను ప్రశంసించారు.గిరిజన విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంపునకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.విద్యార్థుల విజయాలు వారి కృషి, పట్టుదలతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, పాఠశాల యాజమాన్యం సహకారం, అధికారుల ప్రోత్సాహానికి నిదర్శనమని ప్రతినిధులు పేర్కొన్నారు.



ధరూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ

ధరూర్ మండలం, నవంబర్,17(సమయం న్యూస్)

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్ర, IPS మంగళవారం ధరూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పరిసరాలు, నిర్వహణ, రికార్డులు మరియు పోలీస్ సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణ, పరిసరాల పరిశుభ్రత, రిసెప్షన్, రికార్డుల నిర్వహణ, వివిధ రిజిస్టర్లు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతి తదితర అంశాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, రాత్రి గస్తీ, పెండింగ్ కేసుల పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించి, బాధితులకు చట్టపరిధిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ, పరిశుభ్రత పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ధరూర్ సీఐ రఘురాం,ఎస్సై సురేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల భాగస్వామ్యంతో భూముల రీ సర్వే పూర్తి చేయాలి

పెద్దపల్లి, నవంబర్ 17:

భూముల రీ సర్వేను ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కాల్వ శ్రీరాంపూర్, ముత్తారం మండలాల్లో పర్యటించిన ఆయన రీ సర్వే పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ప్రకటించిన బోనస్‌ను పొందాలని సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముత్తారం సూతన తహసిల్దార్ కార్యాలయంలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని, పాత తహసిల్దార్ కార్యాలయాన్ని గ్రంథాలయంగా వినియోగించేందుకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రీ సర్వేలో గుర్తించిన పొరపాట్లను త్వరితగతిన సరిచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.



వేసవి విద్యుత్ డిమాండ్‌కు ముందస్తు చర్యలు

- **డీటీఆర్‌లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య పెంపు, సబ్‌స్టేషన్ల పనులు వేగవంతం చేయాలి**
- **టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్**

ఖమ్మం, నవంబర్ 17:

ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున పంపిణీ వ్యవస్థను ముందుగానే పటిష్టం చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఖమ్మం సర్కిల్ పర్యటనలో భాగంగా మధిరలో అధికారులతో వేసవి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. అవసరమైన ప్రాంతాల్లో డీటీఆర్‌లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మధిరలో అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులను, బోనకల్ మండలం బ్రాహ్మణపల్లిలో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం వైరాలో ప్రతిపాదిత శాంతినగర్ సబ్‌స్టేషన్, డివిజన్, సబ్ డివిజన్, ఈఆర్ఓ కార్యాలయాల స్థలాలను పరిశీలించారు. వైరా రోడ్డులో నిర్మించనున్న ఇండోర్ సబ్‌స్టేషన్‌పై అధికారులతో సమీక్షించారు.విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సరఫరా అందించేందుకు మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని సీఎండీ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో ఖమ్మం ఆపరేషన్ ఎస్ఈ డీఈలు ఏడీఈలు, ఏఈలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దేశ ప్రయోజనాలపై విదేశీ జోక్యాన్ని సహించం

- **విదేశీ ప్రతినిధుల వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**
- **భారత్ సమ్మిట్‌లో విదేశీ ప్రతినిధుల వ్యాఖ్యలపై విచారణకు బీజేపీ డిమాండ్**
- **సీపీ 'ఎన్.శ్వేత' కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఫిర్యాదు**

వరంగల్, నవంబరు 17 (సమయం న్యూస్) :



హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భారత్ సమ్మిట్ -2026లో దేశ సార్వభౌమాధికారానికి, జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న విదేశీ రాజకీయ ప్రతినిధులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్ సమ్మిట్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన భావజాలాలకు వేదిక కల్పించడం, భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ధోరణులను ప్రోత్సహించడం ఆందోళనకరమన్నారు. అంతర్జాతీయ వేదికలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు.సదస్సులో పాల్గొన్న విదేశీ ప్రతినిధుల ప్రసంగాలు, వ్యాఖ్యలను సమగ్రంగా పరిశీలించాలని, చట్ట ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యం, దేశ సార్వభౌమాధికారం, జాతీయ సమగ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం రాజకీయ ప్రచార కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, అవినీతి, కమీషన్ల వ్యవహారాలపై వస్తున్న విమర్శలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజల ఆకాంక్షలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజాధనాన్ని వినియోగించడం తగదని, దేశ గౌరవం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు బీజేపీ నిరంతరం పోరాడుతుందని గంట రవికుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావు పద్మారెడ్డి, డాక్టర్ పగడాల కాళిప్రసాద్‌రావు, పులి సర్వోత్తంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, జయంతిలాల్, సంద్ర మధు, రాంచంద్రరెడ్డి, మందోటి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- **కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే 'కేఆర్ నాగరాజు'**

కడిపికొండ, నవంబర్ 17 (సమయం న్యూస్)



రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధికారులకు సూచించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని కడిపికొండలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, తూకం యంత్రాలు, ఇతర అవసరమైన సదుపాయాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాజీపేట దర్గా పీఏసీఎస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, 44వ డివిజన్ అధ్యక్షుడు జక్కుల సదానందం, 45వ డివిజన్ అధ్యక్షుడు కర్ర హరీష్‌రెడ్డి, 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల శ్రీనివాస్, 64వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జర్నలిజంలో 30 సీనియర్ జర్నలిస్టులకు నేతలకు సన్మానం

ఖమ్మం, నవంబర్ 17 : (సమయం న్యూస్)



దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేది జర్నలిజమేనని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) నేతలు అన్నారు. జర్నలిస్టులు నిజాన్ని అన్వేషించి, దానిని వెలుగులోకి తెచ్చి ప్రజాస్వామ్యాన్ని బ్రతికిస్తున్నారని కొనియాడారు. జాతీయ జర్నలిజం దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఖమ్మంలోని ఎన్నెస్పీ రామాలయం ఫంక్షన్ హాల్లో డబ్ల్యూజేఐ జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్ ఆధ్వర్యంలో సభ్యులకు తేనేటి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జర్నలిజంలో 30 యేళ్ళ పాటు పని చేసిన సీనియర్ జర్నలిస్టులు ఎన్.ఎస్. రావు, కట్టెకోల చిన నరసయ్య, యెన్నెబోయిన శ్రీనివాస రావు, జాబిశెట్టి కుటుంబ రావు, ఎం.ఏ అన్సార్ పాషా, యం డి.షఫీ యు జమ, గోగుల నారాయణ రావు, గంటెల ఆనంద్, ఏనిగండ్ల శ్రీనివాస రావులను ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం యూనియన్ తెలంగాణ కార్యదర్శి నారా సుభమణ్యేశ్వర రావు (ఎన్.ఎస్.రావు) మాట్లాడుతూ జర్నలిస్టులు నిజాయితీ, సమగ్రత, తటస్థత, చట్టబద్ధత మరియు ప్రజలకు జవాబుదారీతనం వంటి సూత్రాలను పాటించి పని చేయాలని ఉద్బోధించారు. అప్పుడే అభ్యుదయ సామాజిక మార్పుకు దోహద పడిన వారమవుతామని చెప్పారు. అయితే, వృత్తిలో జర్నలిస్టులకు తగిన ఫలితం దక్కడం లేదన్నారు. చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులకు కనీస వేతనాలు దక్కేల చర్యలు చేపట్టాలని కోరారు. అనేక రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పెన్షన్లు ఇస్తున్నారని, తెలంగాణలో కూడా పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే, దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా వున్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డబ్ల్యూజేఐ ఖమ్మం జిల్లా కోకన్వీనర్ యెన్నెబోయిన శ్రీనివాస రావు మాట్లాడుతూ నేడు జర్నలిస్టులు అనేక ఇబ్బందులు పడుతూ ఈ వృత్తిలో కొనసాగుతున్నారని అన్నారు. వీరి సంక్షేమానికి ప్రభుత్వాలు కూడా నిర్దిష్టమైన పథకాలేవీ అమలు చేయడం లేదన్నారు. మరో వైపు జర్నలిజం కత్తి మీద సాములా మారిందని, జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు ఎక్కువయ్యాయని చెప్పారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుందని, జర్నలిస్టులకు అన్నీ విధాలా రక్షణ కల్పించాలని కోరారు. అదే సందర్భంలో జర్నలిస్టులందరూ ఐక్యంగా దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఐక్యంగా వుంటేనే, సంక్షేమ పథకాలను సాధించడంతో పాటు దాడులను ఎదుర్కోగలమని అన్నారు. మరో జిల్లా కోకన్వీనర్ ఎం.ఏ అన్సార్ పాషా మాట్లాడుతూ ఎప్పుడూ బిజీగా వుండే జర్నలిస్టులకు అప్పుడప్పుడూ యూనియన్ ఆధ్వర్యంలో ఆట విడుపుగా ఆటా పాట వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలతో పాటు నాయకులు బొడ్డుపల్లి రవీందర్, పసుపులేటి ఉపేందర్, శ్రీనివాస చారి, వుల్లోజీ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ చేతి ముద్దలోనే ఆరోగ్యానికి అసలైన భరోసా!

- **అంగన్వాడీ కేంద్రంలో తక్కువ ఖర్చుతో పౌష్టికాహార వంటకాల ప్రదర్శన**
- **పేదింటి వంటలోనే పోషకాల పంట...సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ అరుణ్ జ్యోతి**

నర్సంపేట, నవంబర్ 17 (సమయం న్యూస్)



తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇంట్లోనే తయారు చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ అరుణ్ జ్యోతి సూచించారు. నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని నర్సంపేట4 అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంపై మహిళలకు అవగాహన కల్పించడంతో పాటు పౌష్టికాహార వంటకాల తయారీని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. సీడీపీఓ మధురిమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్, ఏఎల్ఎంఎస్సీ చైర్మన్ రామోజు రోజారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్ జ్యోతి మాట్లాడుతూ అన్ని రకాల కూరగాయలను కలిపి తక్కువ సమయంలో కిచిడీ తయారు చేసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన ప్రొటీన్లు, విటమిన్లు అందుతాయని వివరించారు. సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు పిల్లలకు సంపూర్ణ పోషకాహారం అందించవచ్చని తెలిపారు. అనంతరం కూరగాయలతో పోషక విలువలు కలిగిన కిచిడీ తయారీని మహిళలకు చేసి చూపించారు. కార్యక్రమానికి హాజరైన వారికి భోజన వసతి కల్పించారు.కౌన్సిలర్ రామోజు రోజారాణి మాట్లాడుతూ గృహిణి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, వీటి ద్వారా అందించిన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.సీడీపీఓ మధురిమ మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఎన్నో పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, కొందరు తల్లులు బయట లభించే ఆహార పదార్థాలపై ఆధారపడుతున్నారని తెలిపారు. వాటి వల్ల పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఇంటి పెరట్లో కూరగాయలు పండించుకొని, ఇంట్లోనే పరిశుభ్రంగా వండిన పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని సూచించారు.మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ గణేష్ మాట్లాడుతూ తాజా, ఎందుచేపల్లో కాల్షియం, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు సమృద్ధిగా లభిస్తాయని, మాంసాహారులు ఆహారంలో చేపలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజర్ అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ, అంగన్వాడీ టీచర్ నల్ల భారతి మాట్లాడారు. ఏసీడీపీఓ జ్యోతి, డాక్టర్ అరుణ్ జ్యోతి, డాక్టర్ గణేష్, కౌన్సిలర్ రామోజు రోజారాణి, సూపర్‌వైజర్ అరుణ, ప్రధానోపాధ్యాయురాలు శోభ, అంగన్వాడీ టీచర్ నల్ల భారతి, ఆయా సునీత, ఏఎన్ఎం కవిత, అంగన్వాడీ టీచర్లు గొర్రె రాధ, బత్తిని శిరీష, ఎండీ గౌసియా, ఏఎల్ఎంఎస్సీ సభ్యులు రాజమణి, చంకీస్ అనిత, చామంతుల మానస, గూడూరు రమ్య, ఆశా కార్యకర్తలు, సుమారు 50 మంది తల్లులు పాల్గొన్నారు.

సీఐఓ సైన్స్ ఒలింపియాడ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంఈఓ

ఖమ్మం, నవంబర్ 17 : (సమయం న్యూస్)



విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకతతో పాటు నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ నెల 29వ తేదీ ఆదివారం నిర్వహించనున్న చిల్డ్రన్స్ ఇన్నొవేషన్ ఆర్గనైజేషన్ (సీఐఓ) సైన్స్ ఒలింపియాడ్ పరీక్ష పోస్టర్‌ను మండల విద్యాశాఖాధికారి శైలజ లక్ష్మి , ఖమ్మం లో మంగళ వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శైలజ లక్ష్మి మాట్లాడుతూ.. సైన్స్ విద్యను నైతిక విలువలతో అనుసంధానిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించే ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఒలింపియాడ్ దోహదపడుతుందని పేర్కొన్నారు.అనంతరం నస్రిన్ సుల్తానా మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులు భావనలను అర్థం చేసుకుని, నేర్చుకున్న జ్ఞానాన్ని అన్వయించుకుంటూ విశ్లేషణాత్మకంగా ఆలోచించేలా సైన్స్ ఒలింపియాడ్ ప్రోత్సహిస్తుందని తెలిపారు. శాస్త్రీయ విజ్ఞానంతో పాటు నైతిక విలువలు కలిగిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడమే సీఐఓ ప్రధాన లక్ష్యమని వివరించారు.పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6, 7, 8వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ సైన్స్ ఒలింపియాడ్‌లో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నూరీ అఫ్షా కోరారు.